Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం, మే 26, 2026 | సంపుటి - 20 | సంచిక 247 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## నాలుగోసారి పెరిగిన
# పెట్రో ధరలు
### పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు



న్యూఢిల్లీ : దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశ వ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. 2లో



## ధాన్యం సేకరణలో
# సహకరించని కేంద్రం
### ఈ యేడు మొక్కజొన్న అధికంగా దిగుబడి
### సిపిఐ బృందంతో సిఎం రేవంత్ వెల్లడి

హైదరాబాద్ : కేంద్రప్రభుత్వం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సీపీఐ బృందం సోమవారం సచివాలయంలో సమావేశం అయ్యింది. సీఎంని కలిసిన వారిలో సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, పశ్య పద్మ , ఈ.నరసింహ, చాడ వెంకట్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. 2లో

## ఇప్పటికే 12లక్షల మెట్రిక్ టన్నుల
# ధాన్యం కొనుగోలు
### మిగతా ధాన్యం కూడా కొనడానికి ప్రభుత్వం సిద్ధం
### కేంద్రం తీరుతోనే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు
### బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల



ఖమ్మం : దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరిధాన్యం కొను గోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కనీసం గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్థితి ఉందని అన్నారు. కేంద్రప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కనీసం డీజిల్ ఇవ్వకపోవటంతో ఎక్కడికక్కడా ధాన్యం రవాణా ఆగిపోయిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ధ్వజ మెత్తారు. అటు సాగర్ ఆయకట్టు.. ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కృష్ణా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పలు సంస్థలను నిర్వీర్యం చేశారని ఫైర్ అయ్యారు. తరువాయి 2లో



## పెట్రో ధరల పెంపు ఎవరి కోసం
### ఎవిర లాభంకోసం ధరలు పెంచుతున్నారు
### కేంద్రం తీరుపై మండిపడ్డ మల్లికార్జన ఖర్గే

న్యూఢిల్లీ : రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరల పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. 2లో



## బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిషేధం
### అలాగే జంతు బలులు కూడా నిషిద్ధం
### అధికారులను ఆదేశించిన యూపి సిఎం యోగి

లక్నో : దేశవ్యాప్తంగా బక్రీద్ వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్‌ల నిర్వహణ, జంతుబలిని అనుమతించబోమని స్పష్టం చేశారు. 2లో

## తమిళనాడులోనూ
# రైతుల రుణమాఫీ
### కోఆపరేటివ్ బ్యాంకు రుణాల మాఫీ ప్రకటన
### 50వేల వరకు రుణమాఫీకి సిఎం విజయ్ ఆదేశం



2లో



## బిఆర్ఎస్ వచ్చాక 24గంటల
# తాగునీరిస్తాం
### ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం
### నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్కటూనా కట్టారా
### అలా చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
### సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే
### కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్ : బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కెటిఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది తరువాయి 2లో



## డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

### గోదావరి పుష్కరాలకు 10కోట్ల మంది
### అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలి
### రాజమహేంద్రిలో అధికారులతో పవన్ సమీక్ష

రాజమండ్రి : గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల-2027 ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో పుష్కరాల ఏర్పాట్లపై రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. తరువాయి 2లో



## తాజ్‌మహల్ సందర్శించిన మార్కో రుబియో
### గంటన్నరపాటు అక్కడ గడిపిన రుబియో జంట

న్యూఢిల్లీ : అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తాజ్‌మహల్ అందానికి ఫిదా అయ్యారు. భారత్ పర్యటనలో భాగంగా ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను కొద్ది సేపటి క్రితం సందర్శి ంచారు. ఆయనతో పాటు భార్య జెనెట్ రుబియో, భారత్‌లోని అమెరికా

## రతన్ టాటా హబ్ ద్వారా
# స్టార్టప్‌లకు ప్రోత్సాహం
### వంద యూనికార్న్ సంస్థల ఏర్పాటు లక్ష్యం
### విలేజ్ టూ గ్లోబల్ మా ప్రభుత్వ నినాదం
### దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలలే ఊతం
### విజయవాడ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్‌లో చంద్రబాబు



అమరావతి : రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీ నుంచి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. వచ్చేది నాలెడ్జ్ ఎకానమీ అని.. దీనిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది తమ ప్రభుత్వ నినాదమని ఉద్ఘాటించారు. ఒక పరిశ్రమ వ్యర్థాలు.. మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుందని వివరించారు. 2లో

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

### మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మే25 : తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం



స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని సీఎం వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామన్నారు.

## చిరంజీవితో ఎగ్జిబిటర్ల సమావేశం

### ఇరు పక్షాల నుంచి వివరాల సేకరణ

### ఇది ప ఎద్ది సినిమాకు మాత్రమే కాదన్న దిల్ రాజు

హైదరాబాద్,మే25 : పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన అనేది కేవలం 'పెద్ది'కి సంబంధించింది మాత్రమే కాదని, ఇండస్ట్రీకిచెందినదని తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు అన్నారు. రెండు రోజుల్లో దీనికి పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం అగ్ర కథానాయకుడు చిరంజీవిని తెలంగాణ ఛాంబర్ ఎగ్జిబిటర్లు, నిర్మాతలు దిల్ రాజు, సురేశ్‌బాబు, కేఎల్ నారాయణ, అల్లు అరవింద్ తదితరులు కలిశారు. దాదాపు గంటకు పైగా ఆయనతో సమావేశమయ్యారు. సినిమాలు ప్రదర్శించే విషయంలో ఎగ్జిబిటర్లు, థియేటర్ యజమానులు కోరుతున్న పర్సంటేజీ విధానం సహా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పర్సంటేజీ విషయంలో ఏదో ఒక స్పష్టమైన నిర్ణయానికి రావాలని ఇటు నిర్మాతలు, అటు ఎగ్జిబిటర్లకు చిరంజీవి సూచించినట్లు సమాచారం. రాబోయే చిత్రాలకు ఇబ్బంది లేకుండా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని అన్నట్లు తెలుస్తోంది. చిరంజీవితో సమావేశం అనంతరం నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ..పర్సంటేజీ విధానంపై ఎగ్జిబిటర్లు అన్ని విషయాలను చిరంజీవిగారికి వివరించారు. ఆయన సానుకూలంగా విన్నారు. వారం కిందట ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీ నుంచి మరిన్ని వివరాలు తెప్పించుకుని పరిశీలిస్తానన్నారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అందుకు సంబంధించిన వివరాలను ఛాంబర్ అధికారికంగా ప్రకటిస్తుందని అన్నారు. ఎగ్జిబిటర్ల సమస్యలను చిరంజీవి సానుకూలంగా విన్నారు. సింగిల్ స్క్రీన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చాం. 'ఇన్ని ఇబ్బందులు ఉన్నాయా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీని కూడా పిలిచి మాట్లాడాతానని అన్నారు. మేము కూడా ఎగ్జిబిటర్లతో కూర్చొని మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటాం అని తెలంగాణ ఎగ్జిబిటర్ల కార్యదర్శి శ్రీధర్ అన్నారు.

## కాక్రోచ్ జనతాపార్టీపై అత్యసవర విచారణ

### అంతగా భావోద్వేగానికి గురికావద్దు

### తిరస్కరించిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం

న్యూఢిల్లీ,మే25 : భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఇటీవల నిరుద్యోగులను కాక్రోచ్‌లతో పోల్చడం, అవి కాస్తా వివాదం కావడం, వివాదాస్పద వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ వైరల్ అయింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి సంబంధించిన పిటీషన్‌ను అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే న్యాయవాదులు మాత్రం ఈ పిటిషన్ విచారణకు పట్టుబడుతుండడంతో సోమవారం న్యాయవాదులనుద్దేశించి సుప్రీం చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'దానిపై అంత భావోద్వేగానికి గురికావద్దని ఆయన న్యాయవాదుల్ని కోరారు. కోర్టులో రెండు కీలక ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కోర్టు పరిశీలనలు వాణిజ్యపరంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపిస్తూ ఓ పిల్ దాఖలైంది. కాక్రోచ్ జనతాపార్టీ ప్రచారానికి సంబంధించి సిబిఐ విచారణ కోరుతూ మరొక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ రెండు పిల్‌లపై న్యాయవాదులు కోర్టు ముందు ప్రస్తావించగా ఈ పిటిషన్లను అంత అత్యవసరంగా విచారించాల్సిన ఆవశ్యకత ఏమీ లేదని, వాటిని తగిన సమయంలో పరిశీలిస్తామని సిజెఐ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్ ఉద్యమం న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని ఎన్ కె గోస్వామి అనే న్యాయవాది వాదించగా.. 'దానికంత భావోద్వేగానికి లోనుకావద్దు' అని సిజెఐ అన్నారు.

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

### పలువరికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి

### కార్యక్రమంలో ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు

న్యూఢిల్లీ,మే25 : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

## తమిళనాట అన్నా డిఎంకెకు ఝలక్

### ముగ్గరు ఎమ్మెల్యలే రాజీనామా

### టివికెలో చేరేందుకు గ్రీన్ సిగ్నల్

చెన్నై,మే25 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అన్నాడీఎంకే కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోమవారం ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఆ తర్వాత టీవీకే మంత్రి ఆదవ్ అర్జునను కలిశారు. మరగతం కుమారవేల్, జయకుమార్, సత్యభామ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు సమర్పించారు.

## పలు ప్రాంతాల్లో ఈదురుగాలుల వర్షం

### రోహిణి ప్రవేశంతో మండుటెండలు మరింత తీవ్రం

### పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు

హైదరాబాద్,మే25 : తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ఘట్‌కేసర్‌లో వడగళ్ల వర్షం కురిసింది. మెదక్, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్షం కురిసింది. దీంతో ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. మెదక్ పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. గంగినేని థియేటర్ వద్ద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మెదక్ మార్కెట్ యార్డులో ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ర్యాలమడుగులో ఈదురుగాలుల తీవ్రతకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది. మంభోజిపల్లిలో 3 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడులో ఈదురుగాలులు ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇకపోతే రోహణి కార్తె సోమవారం నుంచే ప్రారంభం అయ్యింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. రోహిణీ కార్తె ప్రవేశించిన వేళ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. తెలంగాణ ప్రణాళికా సంఘం మే 25న విడుదల చేసిన గరిష్ట ఉష్ణోగ్రతల వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఎండ తీవ్రత 45 డిగ్రీల నుండి ఏకంగా 46.5 డిగ్రీల సెల్సియస్‌కు చేరడంతో జనం ఇళ్ల నుండి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే మొదలవుతున్న ఎండ తీవ్రత, మధ్యాహ్నానికి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. దీనితో పాటు సూర్యాపేట, మంచిర్యాల జిల్లాల్లో 46.4 డిగ్రీలు, నల్గొండ, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 46.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో 46.2 డిగ్రీలు, జగిత్యాలలో 46.1 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల్లో 45.9 డిగ్రీలుగా ఎండ తీవ్రత నమోదైంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటేసి రెడ్ అలర్ట్ పరిధిలోకి వచ్చేశాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విషయానికి వస్తే.. నగరంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, చుట్టుపక్కల ఉండే మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 42.4, రంగారెడ్డిలో 43.1, సంగారెడ్డిలో 42.1 డిగ్రీల చొప్పున ఎండలు ఉన్నాయి. కేవలం నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మాత్రమే నిన్నటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తక్కువగా నమోదై కాస్త ఉపశమనం కలిగించాయి. అయితే, రాబోయే మూడు రోజుల వాతావరణ ముందస్తు సూచనలు కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేవు. రానున్న రోజుల్లో ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం లాంటి జిల్లాల్లో ఎండలు మరింత ముదిరి 45.7 డిగ్రీల వరకు వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యం గా మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

## బతికుంటే సహాయం సున్నా

### చస్తే దక్కని కనీస మర్యాద

### వ్యక్తి మృతదేహాన్ని మోసుకెళ్లిన ఘటన దారుణం

### ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్,మే25 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో పరిస్థితి చాలా దారుణంగా దిగజారిపోయిందని ఆరోపించారు. ఒక మృతదేహాన్ని కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బతికి ఉన్నప్పుడు సహాయం లేకపోయినా, మరణానంతరం కనీస గౌరవం కూడా దక్కని పరిస్థితికి తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకెళ్లిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఓ పోస్టు పెట్టారు. పేదల అంతిమయాత్ర కూడా గౌరవప్రదంగా సాగాలని కేసీఆర్ హయాంలో భావించి, మృతదేహాల తరలింపునకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశాయమని కేటీఆర్ గుర్తుచేశారు. అదే మానవత్వం, అదే ప్రజల గౌరవాన్ని కాపాడే పాలన అని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసోందని.. ప్రజలకు అవసరమైన కనీస వసతులను అందించడంలో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పోస్టర్లు, సభలు, పర్యటనలు, హెలికాప్టర్ల కోసం ప్రజల డబ్బును ఖర్చు చేస్తున్నారని, కానీ పేదలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహించారు. రాజకీయ కక్షసాధింపులు, విమర్శలు, ప్రచార హోరులోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిమగ్నమైందని విమర్శించారు. ప్రజల కష్టాలు, సమస్యలు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో పాలన సాగిందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన మార్పు ఇదేనా..? అని ప్రశ్నించారు. తెలంగాణ గౌరవాన్ని వీధుల్లోకి లాగడానికే ప్రజలు ఈ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారా..? అని నిలదీశారు. నాయకుల పాదయాత్రలకు విలాసవంతమైన బస్సులు, ప్రచారాలకు ప్రభుత్వ వనరులు ఉపయోగించే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, పేదల అంతిమయాత్రకు కనీస గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటన కేవలం ఒక కుటుంబం విషాదం మాత్రమే కాదని, తెలంగాణ సమాజాన్ని కుదిపేస్తున్న పరిస్థితికి నిదర్శనమని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఓ కుటుంబం తమ బంధువు మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కండె వెంకన్న (42) వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు వెంకన్న అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తర్వాత మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

### ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్దాలు

### ఎన్సాన్‌పల్లి ఐకెపి సెంటర్ సందర్శించిన హరీష్ రావు



సిద్దిపేట : ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అరిగోస పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. యూరియా, సాగునీరు, కరెంట్ సరఫరా, పండిన పంట కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యిందన్నారు. రైతులు ఇంత బాధపడటం మొట్టమొదటి సారి చూస్తున్నామన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్లో వరి ధాన్యాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రభుత్వం ఉన్నా ఇట్లాంటి దుర్భర పరిస్థితులు ఎదురు కాలేదని చెప్పుకొచ్చారు. 'ఉత్తమ్ నీది నోరా మోరా.. మొన్న 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అని చెప్పి ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అనడం ఎంతవరకు సబబు' అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం కాదని.. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కోటి మెట్రిక్ టన్నుల ధాన్యంలో 70 లక్షలు కొంటే మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని మాజీ మంత్రి ప్రశ్నించారు. తాలు పెడితే తోలు తీస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు 5 కిలోలు తరుగు తీస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని విమర్శించారు. రోహిణి కార్తె వచ్చినా కళ్లాల్లోనే ధాన్యం, రైతులు ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నదని తెలిపారు. రైతులు గుండెలు బాదుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కళ్లు కనబడటం లేదంటూ విమర్శలు గుప్పించారు. వరి కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ÷ూష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు వదిలారని హరీశ్ రావు తెలిపారు. 'మిషన్ మోడ్‌లో వడ్లు కొనాలని రేవంత్ అంటున్నారు. నీది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్. నిన్న కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులకు ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశించారు. రైతుల ఆశలు నిరాశ అయ్యాయి. 45 రోజుల్లో మొత్తం రైతుబంధు వేస్తానని చెప్పి 60 రోజులు గడిచినా వేయలేదు. రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమే... దేవుని మీద ఒట్టు పెట్టి మాట తప్పిన రకం నువ్వు. ఢిల్లీ ట్రిప్పులు మాని.. లారీల ట్రిప్పులు పెంచు. ఒకటి, రెండు రోజుల్లో మార్పు రాకుండే స్వయంగా నేనే కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నా చేపడతా. వేలాది మంది రైతులతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌లను దిగ్బంధిస్తాం. రాజకీయ విమర్శలు మాని పరిష్కార మార్గాలు చూడండి' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## లారీల సమస్యతో ధాన్యం తరలింపులో ఆలస్యం

### తడిసిన ధాన్యం సైతం ప్రభుత్వం కొంటుంది

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడి

హైదరాబాద్,మే25 : రాష్ట్రంలో పండిన ధాన్యమంతా ప్రభుత్వం తప్పక కొనుగోలు చేస్తుందని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. లారీల కొరత వల్ల ధాన్యం తరలింపు ఆలస్యం అవుతోందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'లారీల కొరత సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇసుక లారీలు, ట్రాక్టర్లను కూడా ధాన్యం తరలింపు కోసం వాడుతున్నాం. ఈలోపు వర్షం పడి ధాన్యం తడిసినా.. ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ధాన్యం తడిసి రంగు మారినా.. కొనుగోలు చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్, భాజపా నాటకాలు ఆడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల టన్నులనే కొనుగోలు చేస్తామని చెప్పింది. ధాన్యం కొనుగోళ్ల గురించి మాట్లాడే హక్కు భాజపా నేతలకు లేదు. రాష్ట్రంలో కోటి టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. కేంద్రం మాత్రం 52 లక్షల టన్నులకు మాత్రమే మద్దతు ధర చెల్లిస్తామని చెప్పింది. రాష్ట్రంలో మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని భాజపా నేతలు కేంద్రానికి చెప్పాలి. కేంద్రం కొనకపోయినా.. మొత్తం ధాన్యాన్ని రాష్ట్రం కొనుగోలు చేస్తోంది. కేంద్రం మద్దతు ధర ఇవ్వకపోయినా మరో 70 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తోంది. రైతులను అడ్డం పెట్టుకొని భాజపా, బీఆర్ఎస్ కలిసి డ్రామాలు చేస్తోంది' అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

## కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే

### కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,మే25 : కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సిజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. దీనిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సిజెపి ఫాలోవర్లను పాకిస్తాన్ వారిగా చెప్పడాన్ని అభిజీత్ తీవ్రంగా ఖండించారు. తన ఖాతా హ్యాక్ కావడానికి ముందు ఫాలోవర్ల భౌగోళిక వివరాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. అందుకు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఆ వివరాల ప్రకారం, 94 శాతానికి పైగా ఫాలోవర్లు భారతదేశానికి చెందినవారేనని అభిజీత్ తెలిపారు. భారత యువతను పాకిస్తానీయులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎందుకు ముద్ర వేస్తున్నారని అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ కేంద్ర మంత్రి రిజిజు మరో పోస్టు చేశారు. 'పాకిస్తాన్, జార్జ్ సోరోస్ వర్గాల నుంచి సోషల్ మీడియాలో ఫాలోవర్లను సంపాదించుకోవాలనుకునే వారిపై నాకు జాలి వేస్తోంది. భారతదేశంలో తగినంత జనాభా, 'అత్యంత చురుకైన యువత ఉన్నారు. వారు నిజమైన, విలువైన అనుచరులుగా ఉండగలరు. గుర్తింపు కోసం దేశ వ్యతిరేక శక్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలు నిలిపేశారు.

# సంపాదకీయం

## అందరికీ సమ్మతంగా సాగాలి 'సర్'!

దేశవ్యాప్తంగా పలు వివాదాలతో సంచలనం రేపుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) సెగ ఇక తెలుగు రాష్ట్రాలకు తాకనుంది. వేసవి కాలం ముగిసి తొలకరి రుతుపవనాలు ప్రవేశించే జూన్ నెలలో తెలంగాణలో 'సర్' వేడి మొదలుకానుంది. ఇప్పటికే దేశంలో రెండు దశల్లో ముగిసిన ఓటర్ల జాబితా ప్రక్షాళన తుది మూడో దశలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా మొత్తం 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపట్టనున్నారు. మొదటి రెండు దశల్లో పశ్చిమబెంగాల్, అసోం, బీహార్, తమిళనాడు, కేరళ, రాష్ట్రాల్లో అక్కడి అసెంబ్లీ ఎన్నికల ముందు 'సర్' ప్రక్రియ నిర్వహించడంతో ఎన్నికల్లో కీలకాంశంగా మారింది. ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు చాలా కాలం ఉన్నా రాష్ట్రంలో 'సర్' రాజకీయ వేడి పుట్టించింది. స్వయం ప్రతిపత్తి సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎలాంటి విమర్శలు ఎదుర్కోకుండా నిష్పక్షపాతంగా తెలంగాణలో 'సర్'ను విజయవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర ఓటర్లు కోరుకుంటున్నారు. కాలానుగుణంగా దేశంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. దేశంలో ఇంతకుముందు 195152, 1960, 1980, 1993, 1995, 2002 2004 సంవత్సరాల్లో దేశంలో 'సర్' ప్రక్రియ నిర్వహించారు. 1993-95లో ఎన్నికల గుర్తింపు కార్డు జారీచేసే సమయంలో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను సవరించారు. 2025 26లో భాగంగా తొలుత బీహార్‌లో, అనంతరం 12 రాష్ట్రాల్లో 'సర్' నిర్వహించి, ఇప్పుడు చివరగా 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'సర్' చేపట్టేందుకు సిద్ధమైంది. ఓటర్ల జాబితాలో డూప్లికేట్, చనిపోయిన వారు, చిరునామా మారిన వారు, రెండు చోట్ల ఓట్లు ఉన్నావారు, అర్హత లేని వారి పేర్లను తొలగించి ప్రక్షాళన చేయడమే 'సర్' లక్ష్యమని ఎన్నికల సంఘం పదేపదే చెబుతున్నా దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమియేతర పార్టీలు మాత్రం 'సర్' ప్రక్రియను 'ఎంపిక చేసిన ప్రక్షాళన'గా విమర్శిస్తున్నాయి. దీనిపై పలు రాజకీయ పార్టీలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాయి. 'సర్' ప్రక్రియ ఏ ఒక్క పార్టీకి అనుకూలంగా నిర్వహించడం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత భారత ఎన్నికల సంఘంపైన ఉంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని ఎన్నికల సంఘం చెబుతున్నా తెలంగాణలో రాజకీయ పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం అధికారులను కలిసి తమ సందేహాలు, సూచనలు తెలియజేస్తున్నారు. పార్టీలు తమ నేతలను, కార్యకర్తలను 'సర్'పై జాగృతం చేశాయి. స్వయం కృషీవలుడు మా గోపాలుడు! తెలంగాణలో ప్రారంభం కానున్న 'సర్'పై అనుమానాలకు కారణం ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలే. మొదటి రెండు దశల్లో మొత్తం 12 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో చేపట్టిన మొదటి రెండు దశ 'సర్' ప్రక్రియలో దాదాపు 7.2 కోట్ల ఓట్లు తొలగించబడ్డాయి. అదే సమయంలో సుమారు 2 కోట్ల మంది ఓటర్లను చేర్చారు. రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే బీహార్‌లో 65 లక్షలు (8.3%), ఉత్తరప్రదేశ్‌లో 2.5 కోట్లు (13%), తమిళనాడులో 97.3 లక్షలు (14%), పశ్చిమబెంగాల్‌లో 90 లక్షలు (11%), గుజరాత్‌లో 70 లక్షలు (14.5%), మధ్యప్రదేశ్‌లో 34.25 లక్షలు (6%), రాజస్తాన్‌లో 31 లక్షలు (5.7 చ), చత్తీస్‌గఢ్ లో 25 లక్షలు (11%) ఓట్లు 'సర్'లో తొలగించారు. మరోవైపు గోవా, లక్షద్వీప్, అండమాన్ నికోబార్‌లో పూర్తి గణాంకాలు వెల్లడి కాలేదు. 'సర్' ప్రక్రియ చేపట్టిన రాష్ట్రాల్లో ప్రధానంగా బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, అసోంలో వివాదాలు రేగాయి. బీహార్‌లో మొదట కోటి వరకు ఓట్లు తొలగిస్తారనే ప్రచారం జరిగినా రాజకీయ దుమారం, న్యాయస్థానాల జోక్యంతో చివరికి 65 లక్షల ఓట్లు రద్దు అయ్యాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్‌లో 'సర్' దేశవ్యాప్తంగా సంచనలం రేపింది. ఉన్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు పారదర్శకత కోసం న్యాయమూర్తులను పరిశీలకులుగా నియమించి ప్రజాస్వామ్యంపై భరోసా కలిగించింది. పలు సందర్భాల్లో ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చింది. పశ్చిమబెంగాల్‌లో బిఎల్‌ఒలపై ఒత్తిడి పెరిగి దురదృష్టవశాత్తు కొంత మంది మరణించిన ఘటనలు కూడా జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల ముగిసిన తర్వాత కూడా ఇంకా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల తొలగింపు కేసులు న్యాయస్థానాల్లో ఉన్నాయి. తమిళనాడులో నాడు అధికారంలో ఉన్న డిఎంకె 97 లక్షల ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘాన్ని తప్పుపట్టింది. మరిన్ని కనుగొనండి జాతీయ వార్తలు కెరీర్ సమాచారం లైఫ్ స్టైల్‌-ూత్రీంశీ =ఘుం - యువత డిజిటల్ ఉద్యమ సునామీ గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ఓట్లు తొలగించారనే ఆరోపణలున్నాయి. అసోంలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల అంశంతో 'సర్' సున్నితంగా మార్చింది. పలు రాష్ట్రాల్లో 'సర్' వివాదాస్పదమైన నేపథ్యం లో తెలంగాణలో కూడా ఎలా జరుగుతుందో అదే ఆందోళన కలగడం సహజమే. తెలంగాణలో 'సర్' నిర్వహణలో భాగంగా 2026 జూన్ 25 నుంచి జూలై 24 వరకు బిఎల్‌ఒలు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను ధ్రువీకరించనున్నారు. జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది జాబితా అక్టోబర్ 1 లేదా అక్టోబర్ 10న విడుదల చేసే అవకాశముంది. రాష్ట్రంలో ఇప్పటికే ర్యాండమ్ మ్యాపింగ్ చేపట్టారు. 2002 ఓటర్ల జాబితాతో సరిపోలుస్తూ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం 3.32 కోట్ల మంది ఓటర్లుండగా ఇప్పటివరకు జరిగిన మ్యాపింగ్ ఆధారంగా 50 లక్షలకుపైగా ఓటర్లు తగ్గవచ్చనే అంచనాలున్నాయి. ఎన్నికల సంఘం రూపొందించిన 'డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్' సాఫ్ట్‌వేర్‌తో బోగస్, డూప్లికేట్, రెండు చోట్ల ఉండే ఓట్లు తొలగించే వీలుంది. ప్రధానంగా గ్రేటర్ శివార్లలో, కొత్త కాలనీల్లో భారీగా ఓట్లు తొలగించడం, జోడించడం జరిగే అవకాశాలున్నాయి. బిఎల్‌ఒలు, ఎన్యూమరేటర్లు రెండు మూడు సార్లు వచ్చి మరీ తనిఖీలు చేసిన తర్వాతనే తుది జాబితాను రూపొందిస్తారు. ఓటరు రిసిప్ట్ కాపీని డిజిటల్ రికార్డులో భద్రపరుస్తారు. ఓటర్లు 11 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తమ రుజువుగా చూపించవచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది. మరిన్ని కనుగొనండి రాష్ట్ర వార్తలు వీడియో వార్తలు ఆధ్యాత్మిక సమాచారం రాష్ట్రంలో ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో 'సర్'లో కేంద్రబిందువుగా మారే అవకాశాలున్నాయి. నగరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఎపి నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన వారితోపాటు ఇతర దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు భారీగా ఉన్నారు. వీరిలో కొందరికి రెండు రాష్ట్రాల్లోనూ ఓట్లుండే అవకాశాలున్నాయి. మ్యాపింగ్‌లో ఓటర్లు కనిపించకపోవడంతో ఇక్కడ 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగింపు వివాదం కావచ్చు. నగరంలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు నకిలీ పత్రాలతో ఓటర్లుగా ఉన్నారనే ఆరోపణలున్న నేపథ్యంలో సదరు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు నెలకొనే అవకాశాలుంటాయి. సున్నిత ప్రాంతాల్లో అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకొని 'సర్'ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే నగరంలో మ్యాపింగ్ చేపట్టడంలో కొన్ని రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోవడంతో అనర్హులు విధులు నిర్వహిస్తున్నరనే ప్రచారం జరుగతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే తెలంగాణలో కూడా 'సర్' వివాదాస్పదమయ్యే అవకాశాలున్నాయి.ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఎన్నికల సంఘంతోపాటు రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పోలింగ్ బూత్ స్థాయిలో అధికారిక బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఒ), రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్‌ఎ) పాత్ర క్రియాశీలకమైంది. తెలంగాణలో ఒక్కో బిఎల్‌ఒ పరిధిలో సగటున 930 మంది ఓటర్లున్నారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలోనే ఓటర్ల జాబితా రూపొందిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉంటే వివాదాలు అరికట్టవచ్చు. ప్రజాస్వామ్యానికి ఎన్నికల ప్రక్రియ పునాది. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకం. ఓటర్ల జాబితా ప్రక్షాళన 'సర్'పై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, పారదర్శకంగా ప్రక్రియ సాగితేనే ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. అనర్హులను తొలగించి అసలైన అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తే దేశంలో వివాదాస్పదం అవుతున్న 'సర్' నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. కాబట్టి 'సర్' ప్రక్రియ రాజకీయ వివక్ష లేకుండా నిజాయితీగా, పారదర్శకంగా జరిగితేనే ఎన్నికల సంఘం చెబుతున్న "ప్యూరిఫికేషన్"పై ప్రజల్లో "క్లారిఫికేషన్" వస్తుంది. 'సర్' అందరికీ సమ్మతం కావాలి. లేదంటే తెలంగాణలో కూడా 'సర్' మరో రాజకీయ తుపానుగా మారే అవకాశాన్ని కొట్టిపారేయలేం

# మళ్లీ యుద్ధమైతే తీవ్రసంక్షోభమే



అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం దాదాపు ఖాయం అవుతుందన్న ఆశలు కలుగుతున్న తరుణంలో మళ్లీ ఇరాన్‌పై దాడులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సిద్ధం కావడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు పాకిస్థాన్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్ ఇరాన్ సీనియర్ నేతలతో కీలకాంశాలపై చర్చకు శుక్రవారం రాత్రి టెహ్రాన్ చేరుకోగా, అమెరికాతో సమన్వయంతో పనిచేస్తున్న ఖతార్ దౌత్యబృందం కూడా టెహ్రాన్‌కు విచ్చేసింది. ట్రంప్‌ను ఒప్పించి యుద్ధం ఆపడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రంగం లోకి దిగింది. సౌదీ అరేబియా, ఖతార్ ప్రతినిధులతో కలిసి దౌత్యపరమైన చర్చలకు ప్రయత్నిస్తోంది. ఇరాన్ నుంచి మళ్లీ ప్రతిఘటన ప్రారంభమైతే, శత్రుత్వాలు ముదిరితే గల్ఫ్ దేశాల ఆర్థిక పరిస్థితి తీవ్ర సంక్షోభం లోకి కూరుకుపోతుందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. సైనిక చర్య వల్ల అమెరికా తన లక్ష్యాన్ని సాధించలేదని అమెరికా మిత్రదేశాలు ఈ మూడూ హెచ్చరిస్తున్నాయి. గతంలో ఇరాన్ దాడుల వల్ల తామెంత నష్టపోయామో తెలుసుకున్న యుఎఇ ఇప్పుడు తన వైఖరి మార్చుకుంది. గత ఫిబ్రవరిలో ఇజ్రాయెల్ అమెరికా కలిసి ఇరాన్‌పై దాడులకు పాల్పడినప్పుడు ఇరాక్ లోని మిలిటెంట్లను ఇరాన్ రెచ్చగొట్టి గల్ఫ్ దేశాలపై డ్రోన్లతో దాడులు చేయించింది. కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయారు. రేవు పట్టణాలకు, విద్యుత్ ప్లాంట్ల సౌకర్యాలకు కొన్ని లక్షల కోట్ల డాలర్ల వరకు నష్టం జరిగింది. అందుకనే ఈసారి మళ్లీ అలాంటి పరిస్థితి రానీయకూడదని ఈ దేశాలు ట్రంప్‌ను అభ్యర్థిస్తున్నాయి. ఇరాన్‌తో అమెరికా చర్చలు యథా ప్రకారం సాగుతున్నప్పటికీ ఒక కొలిక్కి రావడం లేదు. ఇరాన్ పూర్తిగా అణ్వాయుధాలను, నిల్వలను విసర్జించాలన్న అమెరికా షరతు వల్లనే చర్చలు అసంపూర్ణమవుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలను, అణునిల్వలను విడిచిపెట్టేది లేదని తమ దేశ భద్రతకు అవి అవసరమని ఇరాన్ ప్రతిఘటిస్తోంది. దీంతో ట్రంప్ యుద్ధాన్ని ముగించేందుకు ఒకే ఒక్క నిర్ణయాత్మక భారీ సైనిక ఆపరేషన్ చేపట్టాలని భావిస్తున్నారు. మంగళవారం వరకు చర్చల ద్వారానే పరిష్కారం కనుగొనాలనే ధోరణిలో ఉన్న ట్రంప్ గురువారం రాత్రి నుంచి దాడుల వైపు మొగ్గు చూపుతున్నారు. తన కుమారుని వివాహ కార్యక్రమంలో పాల్గొనాలన్న ఆలోచన విడిచిపెట్టి వైట్‌హౌస్ లోనే ఉంటూ సైన్యాధికారులు, ఇంటెలిజెన్స్ విభాగాలకు చెందిన వారితోనూ చర్చలు జరుపుతున్నారు. అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ చెబుతున్నప్పటికీ అమెరికా ఇజ్రాయెల్ మళ్లీ దాడులకు సిద్ధమవుతున్నాయని తెలిసి అప్రమత్తమవుతోంది. స్తంభింప చేసిన తమ ఆస్తులను విడుదల చేయాలని, పోర్టులపై ఆంక్షలు ఎత్తివేయాలని, హర్మూజ్ జలసంధిపై తమ నియంత్రణ ఉండి తీరాలని తదితర డిమాండ్లను తెరపైకి తెస్తోంది. అంతేకాదు తమ దేశ పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేసింది. ఈ నెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్టు తెలియజేసింది. మళ్లీ దాడులు జరిగితే ఆ యుద్ధం కేవలం పశ్చిమాసియాకే పరిమితం కాదని ఇరాన్ హెచ్చరించింది. ఈలోగా ఇరాన్ విదేశాంగ మంత్రి పాకిస్థాన్ విదేశాంగ మంత్రితో శుక్రవారం యుద్ధం ముగింపుకోసం చర్చలు జరిపారు. శుక్రవారం అమెరికా మిత్రదేశమైన ఒమన్ హర్మూజ్ జలసంధి ద్వారా తమ నౌకల రవాణాకు ఛార్జీల వసూలుపై ఇరాన్‌తో చర్చలు జరపడం గమనార్హం. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి పర్యవేక్షణకు సంబంధించి హద్దుల విషయమై ఒమన్‌తో చర్చించినట్టు ఇరాన్ కొత్తగా ఏర్పాటు చేసిన పర్షియన్ గల్ఫ్ స్ట్రయిట్ అథారిటీ వెల్లడించింది. అయితే హర్మూజ్ జలసంధిపై నౌకల రవాణాకు ఇరాన్ ఛార్జీల వసూలు చేయడాన్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తోంది. హర్మూజ్ జలసంధి మార్గంలో ఇరాన్ టోల్ వ్యవస్థను అమలు చేయడం చట్ట విరుద్ధమని, అంతర్జాతీయ నౌకా రవాణా మార్గంలో రాకపోకలను నిర్ణయించే హక్కు ఏ దేశానికీ లేదని, దీన్ని ఏ దేశమూ అంగీకరించ కూడదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పిలుపునిచ్చారు. ఇటువంటి చర్యలు అమెరికా ఇరాన్ శాంతి చర్చలను మరింత సంక్లిష్టం చేస్తాయన్నారు. హర్మూజ్ జలసంధి మీదుగా రవాణా సాగించే నౌకల నుంచి రూ. 18 కోట్ల వంతున ఇరాన్ ఫీజులు వసూలు చేయడం మొదలు పెట్టినట్టు ఇరాన్ ప్రభుత్వ రంగ మీడియా వెల్లడించింది. హర్మూజ్‌పై నియంత్రణ సాధించడానికి, యుద్ధం వల్ల తమకు కలిగిన అపార నష్టాన్ని పూడ్చుకోవడానికి ఈ టోల్ వసూలు చేస్తున్నామని ఇరాన్ చెబుతోంది. ఈ పరిస్థితుల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెద్ద కుమార్తె ఇవాంకా ట్రంప్ హత్యకు కుట్ర జరిగినట్టు, ఆ కుట్ర అమలు చేసే లోపే ఆ ఉగ్రవాది టర్కీలో అరెస్టు కావడం సంచలనం కలిగించింది. దీని వెనుక ఇరాన్ ఇరాక్ పాత్ర ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులు తిరిగి ప్రారంభమైతే లేదా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేస్తే ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం మరింత తీవ్రమై, చమురు ధరలు రికార్డు స్థాయిలో పెరిగి, స్టాక్ మార్కెట్లు కుప్పకూలే ప్రమాదం ఉంది. అంతేకాదు ఆహార ధాన్యాల ధరలు, ఎరువుల కొరత దేశీయ మార్కెట్‌లో సామాన్యుడిపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతుంది. గల్ఫ్ దేశాలకు ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. ఈ పరిణామాలు అంతర్జాతీయ వాణిజ్యాన్ని, ముఖ్యంగా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థను తీవ్ర మాంద్యం లోకి నెట్టే పరిస్థితి ఏర్పడుతుంది

## ఏఐఏడీఎంకేకు షాక్.. టీవీకేలో చేరనున్న ముగ్గురు రెబల్ ఎమ్మెల్యేలు




తమిళనాడులో ఎన్నికల తర్వాత కూడా రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. కలిసి పోటీ చేసిన కూటమి నుంచి పార్టీలు బయటకు వస్తున్నాయి. ఒక కూటమి పార్టీ మరో కూటమి పార్టీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. కొందరు ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఏఐఏడీఎంకే పార్టీ ఎమ్మెల్యేలు ముగ్గురు ఆ పార్టీని వీడబోతున్నారు. అధికార టీవీకే పార్టీలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం చాలా మంది ఏఐఏడీఎంకే పార్టీ ఎమ్మెల్యేలు టీవీకేకు మద్దతు ప్రకటించారు. అప్పట్లో తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేల్లో ముగ్గురు తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను కలిశారు. అలాగే, మంత్రి ఆధవ్ అర్జునను కూడా కలిశారని తెలుస్తోంది. వీరంతా సీఎం విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే పార్టీలో చేరాలని భావిస్తున్నట్లు సమాచారం. ముగ్గురు రెబల్ ఎమ్మెల్యేల్లో ఒకరైన కే మరగతం కుమారవేల్.. టీవీకే అభ్యర్థిపై ఏడు వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. మరో ఎమ్మెల్యే ఎస్ జయకుమార్ డీఎంకే అభ్యర్థిపై గెలిచారు. మరో ఎమ్మెల్యే సత్యభామ డీఎంకే అభ్యర్థిపై విజయం సాధించారు. సత్యభామ తన ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన అవిశ్వాస తీర్మానం సందర్భంగా ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు సహా 25 మంది ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో వీరంతా టీవీకేలో చేరుతారని ప్రచారం జరిగింది. ఒకవేళ వీరంతా టీవీకేలో చేరితే ఆ పార్టీకి పూర్తి మెజారిటీ లభిస్తుంది. ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందీ లేకుండా కొనసాగుతుంది. ఏఐఏడీఎంకే రెబల్ నేతలకు ఎస్పీ వేలుమణి, షణ్ముగంలు నాయకత్వం వహిస్తున్నారు. వీరు పళనిస్వామి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. పళనిస్వామిని పార్టీ జనరల్ సెక్రెటరీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## తాజ్ మహల్ చూసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు : మార్కో రూబియో

హైదరాబాద్ : భారతదేశ పర్యటనలో భాగంగా మూడో రోజు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో సోమవారం ఆగ్రాలోని చారిత్రిక కట్టడం తాజ్ మహల్‌ను(ఖుయ మీఖుష్టుశ్రీ) తన భార్య జీనెట్ రూబియోతో కలిసి చారిత్రాత్మక తాజ్ మహల్‌ను సందర్శించారు. ఆ కట్టడాన్ని ప్రపంచ సంపదలలో ఒకటిగా కొనియాడారు. వారు తాజ్ మహల్ వద్ద సుమారు గంటన్నర సేపు గడిపారు. సందర్శకుల పుస్తకంలో "ప్రపంచపు నిజమైన సంపదలలో ఒకటైన తాజ్ మహల్‌ను సందర్శించేందుకు మాకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు" అని రాశారు ఈ పర్యటనలో భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ కూడా వారితో పాటు ఉన్నారు. కాగా, ప్రపంచంలోని ఏడు అద్భుతాలలో ఒకటైన తాజ్ మహల్ ఇండియాను సందర్శించే ఉన్నత స్థాయి ప్రపంచ నాయకులను, ప్రముఖులను నిత్యం ఆకర్షిస్తూనే ఉంది. గత సంవత్సరం, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషా వాన్స్, వారి పిల్లలు వివేక్, మిరాబెల్, ఇవాన్‌లతో కలిసి ఈ కట్టడాన్ని సందర్శించిన విషయం తెసిందే. కాగా, మే 23 నుంచి మే 26 వరకు జరిగే ఈ పర్యటనలో మార్కో రూబియో భారత్ -- అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వాణిజ్యం, ఇంధనం, రక్షణ, సహకారం, క్వాడ్ (ఖుఖూఅ) సమావేశాలపై భారత నాయకులతో చర్చలు జరపనున్నారు. ఇంధన సరఫరాలు, వాణిజ్యం, రక్షణ రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని గతంలోనే ఆయన స్పష్టం చేశారు.

## అజ్ఞాన హరణమే.. అంబర అపహరణం

శ్రీమద్భాగవతం శ్రీకృష్ణలీలామృత సాగరం. ఈ లీలలన్నీ అప్రాకృతాలు- అభౌతికాలు, చిన్మయాలు. అధ్యాత్మ తత్త రహస్య భావనాగర్భితాలు. అనంత రస వర్షకాలు. అవి భౌతికాల వలె కనిపించినా చక్కగా విచారణ జరిపితే జీవుల భౌతిక- ప్రాపంచిక వాసనలను, జీవత్వాన్ని పూర్తిగా తొలగించి చిన్మయత్వాన్ని ప్రసాదిస్తాయి. జీవుల కర్మలు కర్తృత్వ బుద్ధి (అహంకారం)తోను, స్వార్థం (మమకారం)తోను కూడి ఉంటాయి. కనుక, అవి బంధకాలు- జన్మ సంసార బంధనాలు కలిగిస్తాయి. కాని, (జన్మకర్మ చ మే దివ్యం- గీత) దేవదేవుని కర్మలు దివ్యములు. కాన మోచకాలు- జీవుల బంధనాలు తొలగిస్తాయి. వీటికి 'లీలలు' అని పేరు. 'లయనం లాతి ఇతి లీలా'- మనస్సును లయింపజేసి ముక్తిని కలిగించేదే లీల. 'మనోనాశో మహోదయః'- మనస్సు నశించుటే మోక్షమని శాస్త్రం. అయితే, బాలకృష్ణుని లీలా విమర్శ చేసేటప్పుడు అతని నామ, రూప, గుణచేష్టలు ప్రాకృతాలు- పాంచభౌతికాలు కావు అన్న విషయం చాలా ముఖ్యం. 'న భూత సంఘ సంస్థానో దేవస్య పరమాత్మనః..' అని మహాభారతంలో వ్యాస వచనం. 'దామోదర భగవంతునిలో 'దేహము- దేహి' అన్న భేదం ఉండదు. ఆయన శరీరం పాంచ భౌతికం కాదు. అలా భూత సముదాయంగా భావించేవారు కర్మాధికారాన్ని కోల్పోతారు. అట్టివారి ముఖం చూసినా సచేల స్నానం చెయ్యాలి'. అంటే, అది అంతగా దోషావహమన్నమాట! భాగవతంలోని నవనీత చౌర్యం, చీర (వస్త్ర) హరణం, రాసలీల- ఇవన్నీ దివ్య చిన్మయి లీలలు. కాని, అధిక ఆక్షేపణకు, అపార్థాలకు గురైన ఘట్టాలు.



ఆధ్యాత్మికం

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలి....

● అక్రిడేషన్ కమిటీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానానికి బదులుగా జిల్లా కలెక్టర్ సొంత పరిశీలనలో పెండింగ్ ? ● కలెక్టర్ ఏకపక్ష నిర్ణయంతో నిజమైన జర్నలిస్టులకు అన్యాయం ● అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇస్తామన్నా రాష్ట్ర ప్రభుత్వం ● భిన్నంగా వ్యవహరిస్తున్న జిల్లా అక్రిడేషన్ కమిటీ చైర్మన్ ● త్వరలోనే రాష్ట్ర సమాచార శాఖ మంత్రి, కమిషనర్లకు ఫిర్యాదు చేస్తాం ● జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, సోమవారం జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ అనంతరం అడిషనల్ కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఏ పేపర్లో అయినా పనిచేసే నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్ డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమ సంఘం జె ఎస్ ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వివిధ పత్రికల్లో పని చేస్తున్న జర్నలిస్టులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రానికి సంబంధించి అడిషనల్ కలెక్టర్ డిపిఆర్ఓ కు ఫార్వర్డ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇస్తామని చెబుతున్నారని తెలిపారు. అందుకు భిన్నంగా పెద్దపల్లి జిల్లాలో అక్రిడేషన్ కమిటీ చైర్మన్గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ అక్రిడేషన్ కమిటీ సభ్యులు అన్ని పత్రికలకు సంబంధించిన 187 మంది జర్నలిస్టులను గుర్తించి ఏకగ్రీవంగా తీర్మానం చేసి సంతకాల తో కూడిన జాబితాను కలెక్టర్ కు అందజేశారని తెలిపారు. అందుకు జిల్లా కలెక్టర్ తన సొంత పరిశీలనలో కొంతమంది ఇతర ఉపాధి పనులు చేస్తున్నారని, కొన్ని పత్రికలకు సర్కులేషన్ లేదని, కొంత మంది విలేకరులు కాదనే కారణాలు చూపిస్తూ 34 మంది జర్నలిస్టులను పెండింగ్లో ఉంచారని తెలిపారు. వారిలో నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు తెలియకుండానే ఇన్చార్జి డిపిఆర్ఓ నేరుగా సమాచార శాఖ కమిషనర్ కు పంపించి కేవలం 138 మాత్రమే అక్రిడేషన్ కార్డులు జారీ చేశారని తెలిపారు. అక్రిడేషన్ జారీ చేసిన వారిలో కొంతమంది నేర ప్రవృత్తి కలిగిన వారు, ఇతర ఉద్యోగాలు చేస్తున్నవారు, కొంతమంది పత్రికల యజమానులు రాజకీయ నేపథ్యం కలిగిన వారు అనర్హులకు అక్రిడేషన్లు ఇచ్చారని విమర్శించారు. ఇదే విషయంపై త్వరలోనే రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కు ఫిర్యాదు చేయనున్నట్లుగా తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా వెంటనే స్పందించి అనర్హులైన జర్నలిస్టులను గుర్తించి అక్రిడేషన్లను తొలగించాలని, పెండింగ్ లో ఉన్న వారిలో నిజమైన వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించి అక్రిడేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న అన్ని పత్రికలకు సంబంధించిన నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు ఈ నెలలోపు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ప్రతిసారి అక్రిడేషన్ విషయంలో నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో డీలర్లు, వ్యాపారస్తులు, ప్రభుత్వ ఉద్యోగులకు అక్రిడేషన్లు ఇచ్చారని వారిని గుర్తించి తొలగించాలని డిమాండ్ చేశారు. 24 గంటలు రాత్రి పగలు వార్తలు కవర్ చేస్తూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్న చిన్న పత్రికలు పెద్ద పత్రికలు అనే తేడా లేకుండా నిజమైన వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్న పత్రికల్లో పని చేసే నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి అక్రిడేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శులు కన్నూరి రాజు, వద్దాల లత, జాతీయ కమిటీ సభ్యులు సభ్యత్వం లక్ష్మణ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంథని రఘు, జిల్లా ఉపాధ్యక్షులు రాజు కుమార్, జిల్లా ప్రచార కార్యదర్శి అనిల్, జిల్లా కోశాధికారి సోమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ టీవీ కరస్పాండెంట్ జేఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు లావణ్య రెడ్డి జిల్లా కమిటీకి మద్దతుగా పాల్గొన్నారు.

# మహిళా అభివృద్ధే దేశ అభివృద్ధి: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ టౌన్,మే25(ది క్రైమ్ న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెప్మా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి కార్యక్రమం కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మెప్మా విభాగానికి సంబంధించిన ఏ సమస్య వచ్చినా వాటి పరిష్కారానికి నగర పాలక సంస్థ ముందుంటుందని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నగర పాలక సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రతి డివిజన్లో మహిళా శక్తి భవనాలు ఏర్పాటు చేసే దిశగా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో మహిళా బిల్లుకు ఆమోదం లభించి మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మరింత భాగస్వామ్యం అయ్యేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా అభివృద్ధే దేశ అభివృద్ధికి పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, డీడబ్ల్యూఓ సరస్వతి, కార్పొరేటర్లు, అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# అహంకారంగా వ్యవహరిస్తే అధికారం దింపడం ఖాయం :బుగ్గవీటి సరళ

● సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహాధర్నా

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** అర్హులైన కొత్త లబ్ధి దారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం నూతన పెన్షన్ లు ఇవ్వాలని, పెన్షన్ ను 2016 రూపాయలు నుంచి 4016 రూపాయలు పెంచి ఇవ్వాలని, ఖమ్మం నగరంలో పెంచిన ఆస్తి పన్నులు వెంటనే తగ్గించాలని సిపిఐ ఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ డిమాండ్ చేశారు. కొత్త లబ్ధి దారులకు కొత్త పెన్షన్ లు ఇవ్వాలని, ఎన్నికల హామీలు అమలుపరచాలని, ఖమ్మం నగర ప్రజలపై వేసిన ఇంటి టాక్స్ లు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది అర్హులు తమకు కొత్త పెన్షన్ లు ఇవ్వాలని కోరుతూ ధర్నా కు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా అధికారానికి దూరంగా వుండి, ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆచరణలో మాత్రం ప్రజల పట్ల గత ప్రభుత్వ ఎలా వ్యవహరించిందో ఈ ప్రభుత్వం కూడా ప్రజల పట్ల అలాగే వుంటుంది అని, ఇలా ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఈ ప్రభుత్వాన్ని కూడా అధికారం దింపడం ఖాయం అని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అహంకారంగా వుండి ప్రజా సంక్షేమం పట్ల ఉదాసీనత గా వుంటే తెలంగాణ ప్రజలు అధికారం దింపడం ఖాయం అని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు ఫలితంగా సగటు మనిషి జీవితం రోజు రోజుకు ఆర్థిక దిగ్బంధం లోకి వెళ్లి అప్పులు పాలు అవుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలు మోడీ భవితవ్యం పెంచుతుంది అని విమర్శించారు. ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ 2000 రూపాయలు నుంచి 4000 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. 57 సంవత్సరాలు నిండిన వారికి నూతన పెన్షన్ లు ఇస్తామని ఇచ్చిన హామీ వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఎక్కడ లేని విధంగా ఖమ్మం నగర ప్రజలపై ఇంటి పన్నులు భారాలు వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటు సంస్థకు ఇచ్చి అడ్డగోలుగా ఇంటి టాక్స్ లు వేశారు అని దుయ్యబట్టారు. ఇంటి టాక్స్ లు తగ్గించకపోతే దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పింఛన్ లు వెరిఫికేషన్ పేరుతో అర్హత వున్న తొలగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఒకే సారి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలో అనేక ప్రజా సమస్యలపై జిల్లా మంత్రి, కమిషనర్ దృష్టి సారించాలి అని సరళ డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాస రావు, కె. నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, ఉపేందర్, వజేనేపల్లి శ్రీనువాసురావు, పి





మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎం ఎ జబ్బార్, ఎస్ కె మీరా సాహిబ్, దొంగల తిరుపతిరావు, ఎస్.నవీన్ రెడ్డి, బండారు రమేష్, ఎస్. నాగసులోచన, మాజీ కార్పొరేటర్లు ఎల్లంపల్లి వెంకట్రావు, యర్రాగోపీ, నాయకులు ప్రవీణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను దోపిడీ చేస్తున్న ప్రభుత్వం, ప్రజావాణిలో ఎమ్మార్పీఎస్ ఫిర్యాదు

**వడ్ల కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున మోసాలు**

**క్వింటాలుకు 8 నుండి 9 కిలోల తరుగు తీస్తూ రైతుల పొట్టగొడుతున్నారు**

**ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కపల్లి పోలు ఆగ్రహం**





**కరీంనగర్ టౌన్, మే25(ది క్రైమ్ న్యూస్):** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తూ, వారిని నిలువునా దోపిడీకి గురిచేస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్కపల్లి పోలు ఆరోపించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన అధికారులకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎల్కపల్లి పోలు మాట్లాడుతూ మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు, మోసాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రైతులు ధాన్యం తెచ్చి కేంద్రాల్లో పోసి నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోగా తాలు, తరుగు పేరుతో క్వింటాలుకు ఏకంగా 8 నుండి 9 కిలోల వరకు కటింగ్ చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దోపిడీ వ్యవహారంలో ప్రభుత్వ అధికారులతో రైస్ మిల్లర్లు పూర్తిగా కుమ్మక్కయ్యారని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారని పోలు ఈ సందర్భంగా గుర్తుచేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న గన్ని బ్యాగుల కొరతను వెంటనే తీర్చాలని, ఎలాంటి కటింగ్స్ లేకుండా తక్షణమే వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక.. గురువులకు ఘన సన్మానం





**నల్గొండ ప్రతినిధి మే 25 (ది క్రైమ్ న్యూస్):** హాలియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997–1998 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 28 సంవత్సరాల అనంతరం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదివిన పాఠశాలకు తిరిగి చేరుకున్న పూర్వ విద్యార్థులు, ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పి నేడు మంచి స్థాయికి తీసుకువచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ చెన్నమ్మ, ప్రభావతి, సరిత, గాయత్రి, అనంతం, మల్లయ్య, కృష్ణారెడ్డి, రామలింగయ్య, బాలు, సత్యనారాయణ, తిరుమల్, సైదులు మరియు గోవిందరాజు పాల్గొన్నారు.

# రహదారి జాతీయమే..... పక్కన ఫుట్ పాత్ ఏమైనట్టో.....?



**మానకొండూర్, మే25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో పల్లె మీద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దుకాణా దారులు కొంత మంది రోడ్డును ఆక్రమిస్తూ దుకాణా బోర్డింగ్లు, ఇనుప స్టాండ్లు నిబంధనలకు విరుద్ధంగా ఫుట్ పాత్ లపై పెడుతున్నారు. పార్కింగ్ లేక వాహనాలు అడ్డదిడ్డంగా పార్క్ చేయగా పాదాచారులు రోడ్డుపై నడుస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా మండలకేంద్రం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, విద్యార్థులు, ప్రయాణికులు ఫుట్ పాత్ గుండా నడిచేందుకు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. కరీంనగర్ నుండి వరంగల్ వరకు ఎన్నో ఏండ్ల నుండి ఉన్న జాతీయ రహదారికాగా ఆర్అండ్.బి, పంచాయతీ, మండల అధికారుల నిర్లక్ష్యంతో ఫుట్ పాత్ లు ఆక్రమణకు గురై రహదారి ఇరుకుగా మారి లారీలు, బస్సులు, బారీ వాహనాలు అతివేగంగా నిత్యం ఈ దారి గుండానే వెలుతుండడంతో పాదాచారులు బయాభ్రాంతులకు లోనౌతున్నారు. వాణిజ్య భవనాలపై పన్నులు విధిస్తూ తిరిగే అధికారులకు సమస్య కనిపించడంలేదా లేక నిర్లక్ష్యమా అని ఆశ్చర్యపోతూ సంభందిత అధికారులు తక్షణమే స్పందించి ఫుట్ పాత్ లను ఆక్రమించిన దుకాణాలపై చర్యలు తీసుకుని పాదాచారులు రోడ్డుపై నడిచే దుస్థితి లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధికార ప్రతినిధిగా మేకల మహేష్



**తిమ్మాపూర్, మే25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం ఉపసర్పంచ్ మేకల మహేష్ జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఉపసర్పంచుల సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోగా, జిల్లా అధ్యక్షులుగా గోపగాని నవీన్ ఎన్నికకాగా జిల్లా అధికార ప్రతినిధిగా మేకల మహేష్ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు కార్యవర్గం ప్రకటించింది. మేకల మహేష్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నుకున్న ఉపసర్పంచుల ఫోరం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధిలో ఉపసర్పంచుల పాత్ర కూడా కీలకమని, సర్పంచ్తో సమన్వయంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఉపసర్పంచులు ముందుంటారని పేర్కొంటూ జిల్లాలోని ఉపసర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మహేష్ తెలిపారు.

# పరస్పర విమర్శలతో రైతుల సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారు

● మక్కా, వడ్ల కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ ● ఈ నెల 27న పెద్దపల్లిలో 'రైతు గోస ● బీజేపీ భరోసా' బస్సు యాత్ర

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, పరస్పర విమర్శలతో అధికార, ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధులు పక్కదోవ పట్టిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఎమ్మెల్యే విజయ రమణరావు, మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా పరస్పరం విమర్శలు చేసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆధ్వర్యంలో "రైతు గోస -- బీజేపీ భరోసా" బస్సు యాత్ర ఈ నెల 27న పెద్దపల్లి జిల్లాలో కొనసాగనుందని తెలిపారు. ఈ యాత్ర కాటారం, మంథని, పెద్దపల్లి ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సోమవారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన బీజేపీ నాయకులు, అక్కడ వడ్లు మరియు మక్కా కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించారు. రైతులకు బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సదుపాయాలు కూడా కల్పించలేదని, గన్నీ సంచులు, తాడులు, హమాలీలు అందుబాటులో లేరని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించిన తర్వాత నాణ్యత పేరుతో తిరస్కరిస్తున్నారని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించిన బీజేపీ నేతలు, ప్రస్తుత ఎమ్మెల్యే విజయరమణరావు పాలనలో కూడా కమిషన్లు, మైనింగ్ మాఫియా, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు పెరిగాయని విమర్శించారు. ఇద్దరు నేతలు ప్రజా సమస్యలను పరిష్కరించకుండా పరస్పరం సవాళ్లు విసురుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య సిండికేట్ రాజకీయాలు నడుస్తున్నాయని, మిల్లర్లతో కుమ్మక్కై రైతుల కష్టార్జితాన్ని దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సౌదరి మహేందర్, జిల్లా కార్యదర్శి శివంగారి సతీష్, పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యను వ్యాపారమయం చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్

● విద్యాసంస్థలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్మూలించాలి ● ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ కి పి. డి.ఎస్.యు సంఘం వినతి పత్రం అందజేశారు

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల పోటీ ప్రపంచాన్ని నిర్వహిస్తూ విచ్చలవిడిగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు విస్తరిస్తూ విద్యను వ్యాపారమయం చేస్తున్నాయి. విద్యా వ్యవస్థను ఒక వ్యాపారంగా మారుస్తూ ప్రైవేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. విచ్చలవిడిగా ఫీజులు దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రభుత్వం కట్టుదిట్టంగా అరికట్టాలి. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల కంటే ప్రైవేటు విద్యాసంస్థలు రోజురోజుకి పెరిగి పోతున్నాయి. ప్రభుత్వం దగ్గర నుండి ఎటువంటి ఫీజుల నియంత్రణ లేకపోవడం వల్ల విచ్చలివిడిగా విద్యార్థుల్ని లక్ష్యంగా వాళ్ళ తల్లిదండ్రుల దగ్గర డబ్బులు దండుకుంటున్నాయి. విద్యాసంస్థలకు ప్రోగ్రామి, కరుకులం లాంటి వివిధ రకాల పేర్లు పెట్టి ఫీజుల దోపిడీకి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు పాల్పడుతున్నాయి. అడ్మిషన్ ఫీజుల పేరుతోటి, బుక్స్, యూనిఫార్మ్స్, ఐడెంటి కార్డు మరియు వివిధ రకాల పేరుతో ఫీజుల వసులకు పాల్పడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను ఉన్నతవైపుగా మారుస్తా అని చెప్పిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల నియంత్రణపై ఒక చట్టాన్ని రూపొందించి ప్రతి విద్యా సంస్థల్లో వాటిని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావాలి. అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు ఉక్కు పాదం మోపుతూ, అతిగా ఫీజుల వస్తువుల పైన ఎటువంటి భయం లేకుండా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, వాటి గుర్తింపులను రద్దు చేయడానికి కూడా ప్రభుత్వ వెనకాడకూడదని, ఫీజులను నియంత్రిస్తూ అందరికీ సమానమైన విద్యను అందజేసే వైపుగా ప్రభుత్వం ఆలోచించాలని, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఫీజుల భారాన్ని ప్రభుత్వం తగ్గించాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం తప్పక రూపొందించాలని, వాటిని త్వరగా అమలు చేసి తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థకు విద్యార్థులకు సహకరించాలని కోరుతూ పిడిఎస్ యు విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ఖమ్మం అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి కి వినతి పత్రం అందజేసిన పిడిఎస్ యు నాయకులు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఫీజుల నియంత్ర చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.



# అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు వెంటనే అమలు చేయాలి

**విధులు బహిష్కరించిన ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదులు**



**ధర్మపురి, మే 25, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు వెంటనే అమలు చేయాలని ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. సోమవారం ధర్మపురి పట్టణంలో అడ్వకెట్లపై జరుగుతున్న దాడులకు నిరసనగా మొన్న హైదరాబాదులో సహచర న్యాయవాది కాజా మొయినుద్దీన్ ని అత్యంత దారుణంగా చంపడాన్ని ఖండిస్తూ ధర్మపురి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల విధుల బహిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భాన్ని ఉద్దేశించి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందెల రమేష్ మాట్లాడుతూ న్యాయవాది మరణానికి కారణమైన బాధ్యులపై ప్రభుత్వం వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ కస్తూరి శరత్ కుమార్, సీనియర్ ఈసి మెంబర్ రౌత్ రాజేష్, జూనియర్ ఈసీ మెంబర్ గొంటి కిరీటి మరియు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**నల్గొండ జిల్లా ప్రతినిధి మే 25 (ది క్రైమ్ న్యూస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రా రెడ్డి హాలియా మున్సిపాలిటీలోని 4వ వార్డులో మొదటి విడతలో పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా త్రాగునీటి సౌకర్యం, డ్రైనేజీల పూడిక తొలగింపు, వీధి లైట్లు, రహదారుల వెంట పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ సలహాదారు కడమంచి శీను, మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఐ కె పీ వివోఎ పరిష్కరించాలి



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఐ కె పీ వివోఎ పరిష్కరించాలని వైరాలో మే 25 వ తారీఖున సోమవారం నాడు నిర్వహిస్తున్న నిరసన ధర్నా కార్యక్రమానికి సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టి యు సి ఐ ఆధ్వర్యంలో సంఘీభావం తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సంఘీభావ సభలో పార్టీ రాష్ట్ర నాయకులు సి వై పుల్లయ్య మాట్లాడుతూ వివో ఏలకు హెచ్ఆర్ పాలసీ, నెలకు 26 వేల రూపాయల కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, యాప్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సివైపుల్లయ్య, ఎలదండి బాబు, పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి కుదురుపాక దర్గయ్య, పి వై ఎల్ పట్టణ అధ్యక్షులు పరస బద్రి, నాయకులు కన్నెగంటి అశోక్, పద్మావతి, శైలజ, సైనాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్ జింకల పార్క్‌లో అగ్నిప్రమాదం



**నల్గొండ, ప్రతినిధి మే 25 (ది క్రైమ్ న్యూస్):** నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్ కాలనీలో, నాగార్జునసాగర్‌లో ఉన్న టూరిజం హోటల్ విజయ్ విహార్ పక్కన ఉన్న జింకల పార్క్‌లో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గమనించిన టూరిజం అధికారులు మరియు సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో టూరిజం హోటల్ విజయ్ విహార్‌కు ప్రమాదం తప్పింది. సమయానికి స్పందించిన అగ్నిమాపక సిబ్బంది, టూరిజం అధికారులను స్థానికులు అభినందించారు.

# ఒంటరి వృద్ధురాలిని వృద్ధాశ్రమంలో చేర్పించిన తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు



**తిమ్మాపూర్, మే25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ కు చెందిన గంగిపల్లి లింగవ్వ అనే ఎవరూలేని ఒంటరి వృద్ధురాలు సోమవారం నుస్తులాపూర్లో మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాస్ రావును కలిసి తన దీన స్థితిని తెలిపింది. పరిస్థితిని విని వృద్ధురాలి పూర్తి వివరాలు తెలుసుకున్న శ్రీనివాస్ రావు తక్షణమే స్పందించి పోలీస్ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో వృద్ధురాలిని వీర బ్రహ్మేంద్ర ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో చేర్పించారు.నిరుపేదలు, వృద్ధుల పట్ల సేవాభావంతో శ్రీనివాస్ రావు చూపుతున్న సామాజిక బాధ్యతలపై స్థానిక ప్రజలతో పాటు పలువురు ఆయనను ప్రశంసించారు. కార్యక్రమంలో ఏసిపి విజయ్ కుమార్, స్థానిక సిఐ బొల్లం రమేష్, ఎస్ఐ పృథ్వీరాజ్, వార్డు సభ్యుడు ఆలువాల ప్రశాంత్, వీబీ ఫౌండేషన్ నిర్వాహకులు సిపల్లి వీరమాధవ్, రొడ్డ అనిల్, మహమ్మద్ నిసార్ తదితరులు వృద్ధురాలిని వృద్ధాశ్రమంలో చేర్పించడంలో తమ సహకారాన్ని అందించారు.

# సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.10 వేల కనీస పెన్షన్ ఇవ్వాలి

**సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** భూగర్భ గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి రాత్రింబవళ్లు శ్రమించి దేశానికి వెలుగులు అందించిన సింగరేణి కార్మికులకు నెలకు కేవలం రూ.1000 పెన్షన్ ఇవ్వడం అత్యంత దురదృష్టకరమని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి ద్వారా పరిశ్రమలకు విద్యుత్ శక్తిని అందించి దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సింగరేణి కార్మికుల సేవలను ప్రభుత్వాలు తగిన విధంగా గుర్తించడం లేదన్నారు. ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు రూ.2000, వికలాంగులకు రూ.4000, అర్చకులకు రూ.10 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రభుత్వాలు.. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు మాత్రం రూ.1000 పెన్షన్ ఇవ్వడం అన్యాయమని విమర్శించారు.ఎమ్మెల్యేలు, ఎంపీలకు లక్షల్లో జీతభత్యాలు చెల్లిస్తూ.. దశాబ్దాల పాటు ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తించిన కార్మికులను నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ప్రస్తుత ధరల పరిస్థితుల్లో రూ.1000తో కుటుంబ పోషణ అసాధ్యమని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సేవలను గౌరవిస్తూ కనీస పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లో ప్రతిపాదించిన కనీస పెన్షన్ అంశాన్ని ప్రభుత్వాలు సానుకూలంగా పరిశీలించి రిటైర్డ్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సింగరేణి కార్మికుల సంక్షేమంపై మేధావులు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు సమాలోచన చేసి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని డా. మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు.

# నాలుగు తరాల ఆత్మీయ సమ్మేళనం



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం నగర శివార్లలోని చెరుకూరి వారి మామిడితోటలో ఆదివారం యర్రా కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్దార్‌పల్లి గ్రామానికి చెందిన యర్రా యలయ్య, నాగమ్మ దంపతుల సంతానం, ఐదుగురు కుమారులు యర్రా నాగయ్య, రామస్వామి, భద్రయ్య, వెంకటాద్రి, చిన్న వెంకన్నల కుటుంబాలు సుమారు 120 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో యర్రా గురుమూర్తి, యర్రా రమేష్, యర్రా గంగాధర్, యర్రా కొండలు రావు, యర్రా రాజేంద్ర ప్రసాద్ (ఆర్ పి ), యర్రా చిన్న నర్సయ్య, యర్రా నాగరాజు, యర్రా చిన్న వెంకయ్య మరియు ఇతర కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నాలుగు తరాలకు చెందిన మనవలు, మనవరాళ్లు, మునిమనవలు, మునిమనవరాళ్లు అందరూ ఒక్కచోట చేరి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మామిడితోట ప్రాంగణం కోలాహలంగా మారింది. పెద్దల ఆశీస్సులతో చిన్నారుల కేరింతలతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. కుటుంబ పెద్దలు మాట్లాడుతూ, బేధాభిప్రాయాలకు తావులేకుండా అందరం ఐక్యతతో కలిసిమెలిసి ఉండటమే మా తాత యలయ్య మాకు నేర్పిన సంస్కారం. ఇలాంటి కార్యక్రమాలతో కుటుంబ సంబంధాలు మరింత బలపడతాయి. నాలుగు తరాలు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో సంతోషంగా, మరువలేని అనుభూతిగా ఉందని అన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసి, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భవిష్యత్తులో కూడా ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు.

# వివో మహిళ సంఘభవనానికి భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ తిరుపతి



**ధర్మపురి, మే 25, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామంలో సర్పంచ్ కుమ్మరి తిరుపతి వివో మహిళ సంఘభవనానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నెరేళ్ల రమేష్, ఒడ్డెటీ కరుణాకర్ ఒడ్డెటి జయలక్ష్మి, దిటి లక్ష్మణ్, ఓడ్డేటి మంజుల, మిల్కురి సుజాత, సట్టం శెట్టి అనిల్ కుమార్, రాజోరి శ్రీనివాస్, గౌరీ ఎర్రయ్య, మోతె గణేష్, మాజీ ఉప సర్పంచ్ ఒడ్డెటి నరేష్, ఏ పి ఎం ప్రవీణ్ కుమార్, ఐ కె పి మహిళా సంఘాల సిఏ గంగా లక్ష్మి, మహిళా సంఘాల అధ్యక్షురాలు ఉయ్యాల రంజిత, నాయకులు ఒడ్డెటి శంకర్, చేన్నోజి ప్రసాద్, తాళ్లపల్లి మల్లేశం, కొండపల్లి సుధాకర్ రావు, కుమ్మరి రవి, కుమ్మరి రాజన్న, మరియు మహిళలు నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై యూత్ కాంగ్రెస్ ఆగ్రహం

# ఇందిరా చౌక్‌లో వినూత్న నిరసన

● నెల రోజుల్లో 4 సార్లు పెట్రోల్ రేట్లు పెంచిన కేంద్రం ● మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై

**కరీంనగర్‌లో కాంగ్రెస్ ధ్వజం నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన యూత్ కాంగ్రెస్ శ్రేణులు**

**కరీంనగర్ టౌన్, మే25(ది క్రైమ్ న్యూస్):** ఎన్.డి.ఎ ప్రభుత్వ పాలనలో రోజురోజుకీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో నేడు కరీంనగర్ ఇందిరా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం , కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ , సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి , ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య గారితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు ఆటో రిక్షాకు తాడు కట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన తెలియజేయడంతో పాటు నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ సందర్భంగా పోలీసులకు కాంగ్రెస్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది, బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుడి బతుకు భారమైందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కేంద్రంలోని ఎన్.డి.ఎ నేతృత్వంలోని నరేంద్ర మోడీ సర్కార్ నెల రోజుల్లోనే నాలుగు సార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్యులకు మానసిక క్షోభకు గురి చేస్తున్నారు, బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇది నిజంగా సిగ్గుపడవలసిన విషయమని, నేరాలు ధరల్లో పెద్దగా హెచ్చు తగ్గులు లేకున్నప్పటికీ, గత యూపీఏ హయాంలో బ్యారెల్ ధర ఇంతకంటే ఎక్కువగా ఉన్నప్పటికీ సామాన్యులకు ఆర్థిక భారం పడకుండా సరసం అయిన ధరకే పెట్రోల్ డీజిల్ ఇంధనం అందించి పేద సామాన్యులకు అందించిన చరిత్ర ఉందని అన్నారు. కానీ నేడు అసమర్థ బీజేపీ ప్రభుత్వ పాలనలో రూపాయి విలువ పతనానికి చేరి దానివల్ల పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి సామాన్యులపై



ఆర్థిక భారాన్ని మోపుతున్నారని ఇప్పటికైనా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో, రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు ఫహద్, అసెంబ్లీ అధ్యక్షులు పంజాల కృపా సాగర్, కార్పొరేషన్ అధ్యక్షులు ఉప్పరి విశాల్, కార్పొరేటర్లు వరాల నరసింగం, పడాల శ్రీజ అజయ్, గుమ్మడి రాజకుమార్, పర్వతం మల్లేశం, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, రజిత రెడ్డి, కుంభాల రాజ్ కుమార్, అబ్దుల్ రెహమాన్, ఆశిష్ గౌడ్, ఆమేర్, పెంట శేఖర్, ఎట్టం వేణు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులతో కలిసి హసీల్దార్ కార్యాలయం ముట్టడించిన బిజెపి నాయకులు





**ధర్మపురి, మే 25, (ది క్రైమ్ న్యూస్):** భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ధర్మపురి లోని వడ్లు మరియు మక్కల కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వడ్ల, మక్కల రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని వడ్ల మక్కల రైతులతో కలిసి ధర్మపురి తాసిల్దార్ ఆఫీస్ ను సోమవారం ముట్టడించారు. రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి వడ్ల కొనుగోలలో తీవ్రంగా జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి కోసి వడ్లను కొనుకోలు కేంద్రంలో పోసి ఇప్పటికీ రెండు నెలలు అయినా కూడా జోకడం లేదని మ్యాచర్ వచ్చినా కూడా జోకటం లేదని భారదాను సంచులు సుత్తిల్లు లేవని మ్యాన్ పవర్ లేదని ఏదో ఒకటి సాకు చెప్తూ వస్తున్నారని రైతు లు ఆవేదన వ్యక్తంచేశారని తెలిపారు. మ్యాచర్ వచ్చి జోకిన బస్తాలను తీసుకపోవడం లేదని, తీసుక వెళ్లిన బస్తాలను డబ్బులు పడే సమయంలో ఒక రైతుకు ఒక బస్తా రెండు బస్తాల చొప్పున వడ్ల డబ్బులు కట్ చేస్తూ డబ్బులు వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ రైతుల పక్షాన గత రెండు మూడు రోజుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వడ్లు, మక్కలను వెంటనే కొనుగోలు చేసి ఎలాంటి కోతలు లేకుండా రైతు అకౌంట్లో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల రైతుల పక్షాన రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు అప్పం శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్, బీజేవైఎం నాయకులు మండలోజీ, సూరజ్, కార్యదర్శి కలకోట రాజు, కోశాధికారి సంఘీ రాజేష్, బీజేపీ, బీజేవైఎం నాయకులు, ఆనందాసు నవీన్ సోమ్ శెట్టి శివ సాయి, పూదరి పవన్, సోషల్ మీడియా ఇన్చార్జి కాశెట్టి హరీష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు సన్మానం



**మధిర ప్రతినిధి. మే 25: (ది క్రైమ్ న్యూస్):** మార్చి, 2026 పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 550, అంతకంటే ఎక్కువ మార్కులు వచ్చిన మధిర మండలంలోని 72 మంది విద్యార్థిని, విద్యార్థులను కులమతాలకతీతంగా, ప్రభుత్వ ప్రైవేటు అనే తారతమ్యం లేకుండా మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. చారుగుండ్ల నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు వనమా వేణుగోపాలరావు, విద్యా కమిటీ ప్రధాన కార్యదర్శి పెనుగొండ ఉపేందర్, ఖమ్మం స్టెమ్స్ పార్క్ జూనియర్ కాలేజ్ రెజొనెన్స్ కాలేజ్ అధినేత కొండా శ్రీధర్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వనమా కిరణ్ కుమార్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వంగవేటి రాజశేఖర్, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ చైర్మన్ రంగా హనుమంతరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పాల్వాయి వెంకటేశ్వరరావు, ఖమ్మం వాసవి క్లబ్ నాయకులు కడవెండి విశ్వనాథ్, వాసవి ఆర్యవైశ్య కళ్యాణమండపం అధ్యక్షులు కురువెళ్ళ కృష్ణ, ప్రధాన కార్యదర్శి నాళ్ళా శ్రీనివాసరావు, వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం చైర్మన్ పల్లపోతు ప్రసాదరావు, మండల ఆర్యవైశ్య సంఘం సలహాదారులు పుల్లఖండం చంద్రశేఖర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ కర్నాటి రామ్మోహన్రావు, రిటైర్డ్ ఎంపి డి ఓ మాధవరపు నాగేశ్వరరావు, మధిర పెన్షనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పారుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలివ్ షాట్స్.. ఇప్పుడిదే సరికొత్త ట్రెండ్

షాట్స్ అంటే మద్యానికి సంబంధించిన గ్లాసులే గుర్తుకొస్తాయి. కానీ ఇప్పుడో సరికొత్త ట్రెండ్ మొదలైంది. అదే ఆలివ్ ఆయిల్ షాట్స్! ఓ రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ నూనెను గుటుక్కున మింగేయడమే. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. సాక్షాత్తు కర్దాషిన్, జెన్నిఫర్ లోపెజ్ మద్దతిస్తున్న ట్రెండ్. జెన్నిఫర్‌కు ఆలివ్ ఆయిల్ మీద ఎంత నమ్మకం అంటే తన తరగని అందానికి రహస్యం బొటిక్స్, సర్జరీలు కాదు, ఆలివ్ ఆయిల్ సేవనమే అని చెబుతారు. నిజంగానే ఆలివ్ ఆయిల్‌తో చాలా ఉపయోగాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే పాలిఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ సంరక్షణకు దోహదం చేస్తాయట. గుండె నుంచి కాలేయం వరకు శరీరంలోని అన్ని అవయవాలకూ ఆలివ్ ఆయిల్ మేలు చేస్తుందనేది నిపుణుల మాట. భోజనానికీ భోజనానికీ మధ్య విరామంలో ఆలివ్ షాట్స్ తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. దీనికోసం ఎలాంటి రసాయనాలూ కలవని వర్జిన్ ఆలివ్ ఆయిల్‌ని రెండు చెంచాలు వాడాలి. అయితే, ఇలా చేయడం అందరి శరీరాలకు పడకపోవచ్చునీ, వైద్యులను సంప్రదించిన తర్వాతే ఆలివ్ షాట్స్ తీసుకోవాలనీ నిపుణులు సూచిస్తున్నారు.

## స్థల వివాదం నేపథ్యంలో వ్యక్తి మృతి.. ముగ్గురిపై కేసు నమోదు



**నల్గొండ, ప్రతినిధి మే 25(ది క్రైమ్ న్యూస్):** హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేయబడింది. కేతపల్లి ఈదమ్మ, నివాసం కొత్తపల్లి గ్రామం, అనుముల మండలం, హాలియా పోలీస్ స్టేషన్‌కు హాజరై వ్రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదు ప్రకారం, ఆమె భర్త కేతపల్లి రవి మరియు గ్రామానికి చెందిన బూడిద యేశయ్య కుటుంబ సభ్యుల మధ్య స్థల వివాదం విషయంలో పూర్వం నుండి విభేదాలు ఉన్నట్లు తెలిపింది. తేదీ 03.05.2026 రాత్రి సమయంలో బూడిద యేశయ్య, అతని కొడుకు బూడిద నవీన్, తమ్ముడు బూడిద అన్నమయ్యలు ఫిర్యాదుదారురాలి ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగినట్లు, కేతపల్లి రవిని కొట్టి దూషించి, చంపుతామని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం మానసిక ఆందోళనకు గురైన కేతపల్లి రవి గడ్డి మందు (విషపదార్థం) సేవించినట్లు, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ తేదీ 24.05.2026 న మృతి చెందినట్లు ఫిర్యాదులో వెల్లడించారు. పై ఫిర్యాదు ఆధారంగా ఎస్సై. సాయి ప్రశాంత్ హాలియా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ప్రజల సహకారంతో జనగణనను పూర్తి చేయాలి



**తిమ్మాపూర్, మే25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంతో పాటు జోగయ్యపల్లిలో నిర్వహిస్తున్న జనగణన 2027 కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ సెన్సెస్ అధికారి కిషన్ రావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు తమకు కేటాయించిన బ్లాకుల్లో ఇంటింటికీ వెళ్లి 34అంశాలతో కూడిన వివరాలను చరవాణిలో యాప్ లో పొందుపరచాలని సూచించారు. ప్రతి ఇంటి కుటుంబ సభ్యులు తెలిపిన త్రాగు నీరు, నీటి రకం,వంట ఇంధనం, మరుగుదొడ్డి, డ్రైనేజీ విద్యుత్ సౌకర్యం,చరవాణి, ఇంటర్నెట్ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని యాప్ లో పొందుపరచాలని సూచించారు. ఎన్యుమరేటర్ సెన్సెస్ నెంబర్, హౌస్ నెంబర్ తలుపులపై రాయాలని ఎన్యుమరేటర్లు సేకరించే సమాచారాన్ని సూపర్వైజర్లు ధృవీకరించుకోవాలని సూచించారు. ఎంపిఓ కుమారస్వామి, ఫీల్డ్ ట్రైనర్లు తిరుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, ఎన్యుమరేటర్లు పూర్ణచంద్రరావు,అరుణ పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా కలిసిన మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి



**కరీంనగర్ టౌన్, మే25(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి నేడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ముఖ్యమంత్రి కి పుష్పగుచ్ఛం అందజేసి, తనకు ఈ బాధ్యతాయుతమైన పదవిని అప్పగించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి కి ముఖ్యమంత్రి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. మున్నూరు కాపు సామాజిక వర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోని పేద ప్రజలకు అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొని నూతన చైర్మన్‌కు అభినందనలు తెలిపారు.

## పాఠశాలలో వేసవి శిక్షణా శిబిరం -ముగింపు



**మానకొండూర్, మే25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని పిఎం శ్రీ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల11 నుండి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. శిబిరం ద్వారా క్రీడలు, డాన్స్ శిక్షణ, ఫైన్ ఆర్ట్, సంగీతం, కంప్యూటర్ అంశాలలో శిక్షణ ఇవ్వగా ఆఖరున మండలకేంద్రంలోని చౌరస్తాలో విద్యార్థుల కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి ఎంఈఓ ఆర్. శ్రీనివాస్ హజరై శిక్షణలోని అంశాలు విరామ సమయాల్లో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణనందించిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు ఏ దీపారాణి,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమావేశంలో పాల్గొన్నారు.

## నుస్తులాపూర్లో టిబి ముక్త్ భారత్ అభియాన్




**తిమ్మాపూర్, మే25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామపంచాయతీ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్యారావు ప్రారంభించారు. టిబి నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు టిబి నిర్ధారణకై ఛాతి పరీక్షలు, ఎక్స్ రే నిర్వహించి వ్యాధి నిర్ధారణైన వారికి 6 నెలల కోర్స్ మందులను ఉచితంగా అందిస్తారని, క్రమం తప్పకుండా మందులు వినియోగిస్తే టిబి పూర్తిగా నయమౌతుందని సూచించి కార్యక్రమం ద్వారా మొత్తం 72 మందికి ఎక్స్ రే నిర్వహించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దొంత హారిత, నగ్మా నౌషీన్, అలువాల రాజేంద్ర ప్రసాద్,టిబి సూపర్వైజర్ సదయ్య,టిబి కో-ఆర్డినేటర్ సంపత్,హెచ్.ఏలు శ్రీనివాస్, సబీయా, ఆశా కార్యకర్తలు పద్మ, భవాని, సుజాత, రజిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత్ నగర్‌లో ఈగల బెడద

**- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న గ్రామ పంచాయతీ - ప్రజల సమస్యపై సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి తక్షణ స్పందన**





**రామగిరి, మే 25(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని ప్రశాంత్ నగర్ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా ఈగల సమస్య తీవ్రంగా పెరిగిన నేపథ్యంలో, స్థానిక ప్రజలు ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సర్పంచ్, వార్డ్ సభ్యులతో కలిసి ప్రశాంత్ నగర్ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈగలు ఇళ్లలోకి చేరి ఆహార పదార్థాలపై వాలడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, దీనివల్ల వివిధ రకాల అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను శ్రద్ధగా విన్న సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యపై వెంటనే స్పందించి పరిశీలన చేపట్టిన సర్పంచ్ కి ప్రశాంత్ నగర్ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చావ గణేష్, మల్యాల పద్మ ప్రశాంత్ నగర్ వార్డులను పరిశీలించారు.

# వేసవి శిక్షణా శిబిరం క్రీడా నైపుణ్యానికి బాసట

- రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్
- అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు





**రామగిరి, మే 25(ది క్రైమ్ న్యూస్ ):-** వేసవి క్రీడా శిక్షణా శిబిరం క్రీడా నైపుణ్యానికి బాసట అని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. గత 25 రోజులుగా రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు నిర్వహించబడుతున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు, ఔత్సాహిక క్రీడాకారులందరికి క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరంలో సెలవులలో బాల బాలికలకు 25 రోజుల పాటు క్రీడా అంశాల మీద శిక్షణ శిబిరం నిర్వహించడం ద్వారా వారిలో మానసిక పరిపక్వతకు ఎదుగుదలకు, జీవితంలో సాదించాలనే తపన పట్టుదల పెరగడమే కాకుండా వివిధ క్రీడాంశాలలో ఆసక్తి కనబర్చి ప్రతి ఒక్కరిలో గెలుపొందలనే ఆకాంక్ష , పోటీతత్వం, తపన క్రమ శిక్షణ అలవర్చుతుందని తెలిపారు. గతంలో వేసవి సెలవులలో వివిధ ఊర్లకు, గ్రామాలకు వెళ్లడం అక్కడ కొత్త కొత్త విషయములు తెలుసుకోవడం సరదాగా గడపడం జరిగేదని కాని నేటి సమాజంలో ఇప్పుడున్న వాతవరణంలో సెల్ ఫోన్, టివిలు చూడటం వలన పిల్లలలో క్రీడాలపై ఆసక్తి తగ్గి మానసికంగా తమా విలువైన జీవితాన్ని ఎంతో కోల్పోతున్నరని కావున ఎదిగే పిల్లలు తమ సమయం కొంత క్రీడాలపై ఆసక్తి కనబర్చుడం వలన అవి మన భావి భారత జీవితానికి బాటలు వేయటకు ఎంతో దోహదపడగలవని తెలిపారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో ఫుట్ బాల్, వాలి బాల్, హాకీ, విలువిద్య తదితర క్రీడాంశాలములలో శిక్షకుల చేత 90 మందికి శిక్షణ ఇప్పించడము జరిగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, పర్సనల్ విభాగాధిపతి బి. సుదర్శనం, గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, క్రీడల సమన్వయకర్త జవ్వాజి అంజి, క్రీడాకారులు శిక్షకులు ముఖేష్ కుమార్, రవి, రాహుల్, తో పాటు ఇతర విభాగాల అధికారులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలు బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే

- టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ




**మానకొండూర్, మే25(ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్సేతర రాష్ట్రాల్లో దళితులకు ఉద్దేశించిన సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, ఆ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలోని ఇందిరా భవన్ లో ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడు రాజేంద్రపాల్ గౌతమ్ అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్ పర్సన్ల జాతీయస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని కీలక ప్రసంగం చేశారు.ఎస్సీలకు ఉద్దేశించిన సంక్షేమ పథకాలను కొన్ని రాష్ట్రాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్సేతర రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వల్ల దళితులకు అన్యాయం జరుగుతున్నదని, ఈ దృష్ట్యా ఆయా పథకాల అమలు బాధ్యత నూటికి నూరు పాళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేని డాక్టర్ కవ్వంపల్లి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం కాంగ్రెస్ పార్టీ మాత్రమే చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని చెప్పారు. సామాజిక న్యాయం, సమానత్వం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల మూల సూత్రాలని ఆయన గుర్తుచేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి సమన్వయంతో పనిచేయాలని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎస్సీ సెల్ నాయకులు కీలక పాత్ర పోషించాలని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. ఎస్సీ సెల్‌ను గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పలువురు కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

# న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్యకు నిరసనగా సుల్తానాబాద్‌లో కోర్టు విధుల బహిష్కరణ

**సుల్తానాబాద్, మే 25( ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్ హైకోర్టు న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ దారుణ హత్యను ఖండిస్తూ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్ మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషించే న్యాయవాదులపై ఇలాంటి దాడులు జరగడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మొయినుద్దీన్ హత్యకు కారకులైన నిందితులను ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు , న్యాయవాదుల భద్రత కోసం ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మృతుని కుటుంబ సభ్యులకు బార్ అసోసియేషన్ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆవునూరి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు భూసారపు బాలకిషన్ ప్రసాద్, జోగుల రమేష్, బోయిని భూమయ్య, గుడ్ల వెంకటేష్, మల్యాల కరుణాకర్, అంబాల రాజు, అశోక్, సందీప్ తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.



# మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం





**నల్లగొండ జిల్లా: మిర్యాలగూడ, మే. 25 (ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని పలు వార్డుల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. మహిళా సాధికారత, వారి ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన మహిళల ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే సంకల్పంతో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలు, పేదల సంక్షేమం కోసం సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే సహకార సంఘాల్లో పనిచేసే మహిళలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మహిళల సంక్షేమం కోసం మరిన్ని పథకాలను ప్రభుత్వం తీసుకురానుందని, అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


# ఓసీపీలలో సింగరేణి కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం వేసవిలో పని వేళలు మార్చాలి

- సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు, ఓసి-వన్ గని ఇన్చార్జి మేనేజర్ బైరి రమేష్ ద్వారా వినతి పత్రం
- గడ్డం తిరుపతి యాదవ్ ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి



**రామగిరి, మే 25(ది క్రైమ్ న్యూస్):-** వేసవిలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా సింగరేణి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులలో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పని వేళలను తక్షణమే మార్చాలని ఐఎన్టీయూసీ పక్షాన కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు ఓసి-వన్ గని ఇన్చార్జి మేనేజర్ బైరి రమేష్ ద్వారా వినతి పత్రం సమర్పించారు.వేసవి కాలంలో నిబంధనల మేరకు షిఫ్టు వేళలను మార్చాలి. మొదటి షిఫ్టు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ షిఫ్టు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. ఓసీపీలలో పనిచేసే కార్మికులకు వేసవిలో మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ పాకెట్స్ అందించాలని, కార్మికులు నీడలో విశ్రాంతి తీసుకునేందుకు చలువ పందిర్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి వన్నె తెస్తున్న సింగరేణి సంస్థ జాతీయ సంపద అని, కార్మికుల ఆరోగ్యమే సంస్థ అభివృద్ధికి మూలమని ఆయన అన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ గని పిట్ కార్యదర్శి తోకల ప్రవీణ్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, రమేష్, వినయ్, చిట్టబోయిన శ్రీనివాస్, ఆరీఫ్, దిలీప్, రఘు, సమ్మయ్య, తిరుమలేష్, రాజబాబు, రాజన్న, సలీం, రాంచందర్ రావు, రవికుమార్, నరేష్ కుమార్, జంజర్ల తిరుపతి, సాతిని నాగరాజు, రాజన్న, మల్లేష్, కృష్ణ, కుమారస్వామి, దాసు, అన్వర్ పాషా, రాజం, వలి మహమ్మద్, కృష్ణమూర్తిలతో పాటు ఇతర యూనియన్ నాయకులు, మహిళలు, కాంట్రాక్టు, ప్రైవేట్ డ్రైవర్లు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# మాజీ కో ఆప్షన్ అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు



**రామగిరి,మే 25(ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ అంతిమయాత్రలో వివిధ పార్టీల నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. సోమవారం కమాన్ పూర్ మండల కేంద్రంలోని జామా మస్జిద్ నుండి కబ్రిస్తాన్ వరకు అంతిమయాత్రలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, సింగల్ విండో చైర్మన్ భాస్కరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, మాజీ జడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, లొంక కేసారం మాజీ సర్పంచ్ మంజూర్,యువజన కాంగ్రెస్ నాయకుడు మేహరాజ్ ఖాన్, ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్ ,బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, మాజీ సర్పంచ్ కొంతం సత్యనారాయణ, శ్రీ ఆది వరహాస్వామి ఆలయ డైరెక్టర్లు పిల్లి రాజు, బూస శ్రీనివాస్, మంథని మాజీ కో ఆప్షన్ సభ్యుడు యాకూబ్, మాజీ ఉపసర్పంచ్ కలిముద్దీన్, మాజీ సింగల్ విండో చైర్మన్ భద్రపు మల్లేష్, నాయకులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి,గడప కృష్ణమూర్తి, గంట రాజిరెడ్డి, లల్లు, షౌకత్ ఖాన్,మతిన్ ఖాన్, తోట చంద్రయ్య, టి ఆర్ ఎస్ నాయకులు తాటికొండ శంకర్, బొంగోని అనిల్ గౌడ్, బిజెపి నాయకులు మట్ట శంకర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్ రావడం పూర్వజన్మ సుకృతం

**శ్రీ ఆది వరహస్వామి చైర్మన్ ముస్త్యాల దామోదర్**



**రామగిరి,మే 25(ది క్రైమ్ న్యూస్):** శ్రీ ఆదిపరహస్వామి చైర్మన్ తమకు రావడం పూర్వజన్మ సుకృతమని శ్రీ ఆది వరహస్వామి చైర్మన్ ముస్త్యాల దామోదర్ అన్నారు. కమాన్ పూర్ మండలం రొంపిగుంట గ్రామంలో ఆదివార స్వామి ఆలయ పాలకవర్గాన్ని రొంపి కుంట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, డైరెక్టర్లు పిల్లి రాజు, తీగల రాజయ్య గౌడ్, సాగి శ్రీనివాసరావు, తాళ్ల భాగ్యశ్రీ లక్ష్మీనారాయణ, కుందారపు శంకర్, బోస శ్రీనివాస్ గౌడ్, చాట్ల రాయమల్లులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు అని అన్నారు. అలాగే ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు అవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుమ్మడి శ్రీనివాస్ పటేల్, పొన్నగంటి కుమార్, ఉపసర్పంచ్ వడ్నాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లు కటకం రవీందర్, కుందారపు బాపు, నాయకులు కమ్మ గోని మల్లయ్య గౌడ్, కోల నరసయ్య, కోల నరేందర్, గుండేటి శ్రీమూర్తి,గుమ్మడి వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్**

**అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు**




**రామగిరి, మే 25(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు సూచించారు. అందుకు తగిన ఏర్పాట్లను చేయాలని అన్నారు.జీ.ఎం కార్యాలయమునందు సోమవారం వివిధ గనుల, విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 2 న అన్ని గనులు, విభాగాల్లో ఉదయం జాతీయ పతాకాన్ని ఎగరవేయాలని, గనులను, కార్యాలయాలను మామిడి తోరణాలతో, కొబ్బరి, అరటి ఆకులతో, రంగు రంగుల కాగితాలతో అలంకరించాలని సూచించారు. రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణము ముందు గల అమరవీరుల స్థూపానికి, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాలతో నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ రన్ జి.ఎం కార్యాలయం వరకు జరుగుతుందని తెలిపారు. స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణములో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, రుచికరమైన తెలంగాణ రుచులను తెలిపే తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ సంస్కృతిని తెలిపేల సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ఉద్యోగులు, వారి కుటుంబాలకు సంతోషించేలా వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసి వేడుకలను ఘనంగా నిర్వహించాలని అందుకు కావలసిన ప్రణాళికలను రూపొందించుకోవాలని సంబంధిత అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.ఈ సమావేశంలో ఏరియా ఇంజినీర్ సుధాకర్ రెడ్డి, ఎస్వోటుజియం బి.వి.సత్య నారాయణ,ప్రాజెక్ట్ ఆఫీసర్లు జె. రాజశేఖర్, ప్రవీణ్ వి ఫాంటింగ్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, ఐ ఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, ఫైనాన్స్ డిజియం సి. జె.సురేఖ, ఏరియా వర్క్ షాప్ డిజియం మేనేజర్ రాంరెడ్డి , ఎస్టేట్స్ అధికారి ఐలయ్య, అధికారులు కళ్యాణ్ చక్రవర్తి, రాజేశ్వరి, శ్యామల , కోల శ్రీనివాస్, మేఘన, సునీల్ ప్రసాద్, రాజేశం, తో పాటు వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులు, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# కృష్ణాపురం గ్రామంలో వడదెబ్బకు వ్యక్తి మృతి

**మృతి పట్ల నివాళులర్పించిన మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు**



**మధిర ది క్రైమ్ న్యూస్ ప్రతినిధ మే 25:** మధిర మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన భూక్య జయరామ్ (75) వడదెబ్బకు గురై మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ భూక్య సైదుబాబు, భూక్య శ్రీనుల తండ్రి భూక్య జయరామ్ మృతి పట్ల కృష్ణాపురం మాజీ సర్పంచ్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, కృష్ణాపురం మాజీ సర్పంచ్ భూక్య నారాయణ, ప్రస్తుత సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జయరామ్ పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామంలో అందరితో సత్సంబంధాలు కలిగి ఉన్న జయరామ్ మృతి గ్రామ ప్రజలను కలచివేసిందని వారు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు.

# సేంద్రియ ఎరువులతోనే భూసార రక్షణ

- సుల్తానాబాద్‌లో 50% రాయితీపై జీలుగ, జనుము విత్తనాల పంపిణీ
- వరి కొయ్యలను కాల్చి భూసారాన్ని దెబ్బతీయొద్దు
- ప్రజా ప్రభుత్వంలో కటింగ్ లేకుండా చివరి గింజ వరకు కొనుగోలు: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు



**సుల్తానాబాద్, మే 25 (ది క్రైమ్ న్యూస్):** పంట భూముల సారాన్ని పెంచేందుకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు దృష్టి సారించాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. ఇందుకోసం తమ ప్రభుత్వం రైతులకు జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సింగిల్ విండో కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, అధికారులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువుల వాడకంతో పెట్టుబడి ఖర్చు తగ్గి, దిగుబడి ఎక్కువగా వస్తుందని, తద్వారా రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చని అన్నారు. రైతులు ఎవరూ వరి కొయ్యలను కాల్చవద్దని, అలా చేయడం వల్ల భూమిలోని మిత్రపురుగులు చనిపోయి భూసారం తగ్గిపోవడమే కాకుండా అగ్ని ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆధునిక యాజమాన్య పద్ధతులను అవలంబించాలని కోరారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దపల్లి రైతుల ధాన్యంలో క్వింటాకు 10 నుండి 15 కిలోల వరకు కోతలు (తరుగు) పెట్టి నట్టేట ముంచిన వారే ఈరోజు నీతులు పలుకుతున్నారని విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి కటింగ్ లేకుండా అన్నదాతలకు అండగా ఉంటున్నామని, అకాల వర్షాలకు తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని సైతం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. తమ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతులకు ఎలాంటి కష్టం, నష్టం కలుగనివ్వబోమని చెప్తూ, ప్రతిపక్షాలు చేస్తున్న అనవసర ఆరోపణలను ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరీ మహేందర్, దామోదర్ రావు, చిలుక సతీష్, పన్నాల రాములు, అమిరీశెట్టి తిరుపతి, మోబిన్, ఫహీం, మహిళా రైతు నాయకురాలు బండ మాధవి పాల్గొన్నారు. వీరితో పాటు సింగిల్ విండో సీఈఓ బూర్గు సంతోష్, మండల వ్యవసాయ అధికారి పైడితల్లి, కౌన్సిలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మధిర సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదానికి గురైన బాధిత రైతులు మధిర తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



**మధిర ప్రతినిధి. మే 25 (ది క్రైమ్ న్యూస్):** మధిర సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద లో నష్ట పోయిన బాధిత రైతులకు సత్వరమే వంద శాతం పరిహారం ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించే విధంగా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రైతులు అవసరాలకు ఆర్థిక సహాయం10వేల రూపాయలు అందించాలి అని బాధిత రైతుల పోరాట కమిటీ కన్వీనర్ దివ్వెల వీరయ్య, కో కన్వీనర్, గువ్వల సీతారామరెడ్డి డిమాండ్ చేశారు. సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద జరిగి మూడు నెలలు కావస్తున్న బాధిత రైతులను గుర్తించి వారి పేర్లు వారి నిల్వ చేసిన మిర్చి క్వింటాలు లిస్ట్ తయారు చేయటంలో ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు విఫలం చెందారని మధిర తాసిల్దార్ రాంబాబు ని మా పేర్లు ఉన్నాయా లేవా అని అడిగితే తాసిల్దార్ దురుసుగా ప్రవర్తిస్తు అసహనంగా మాట్లాడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులు కమిటీగా ఏర్పడి తాసిల్దారుని కలిసిన పట్టించుకోవట్లేదని దీనికి కమిటీలు కూడా ఆని వ్యంగంగా మాట్లాడుతు రైతులను అవమానపరుస్తూ చిన్నచూపు చూస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. మూడు నెలలు కాలం గడుస్తున్న బాధిత రైతుల లిస్టు తయారు సీసీ నోటీసు బోర్డులో బాధిత రైతుల పేర్లు వారి వివరాలు డిస్ప్లే చేయ పోవటం ఏంటని ఇది ఉద్దేశపూర్వకంగానే ఈ పని జరగట్లేదని ఎన్నిసార్లు కలిసిన రేపు మాపు అంటూ మా వివరాలు చెప్పట్లేదని మేము ఇంకా ఎవరిని అడగాలో మాకు దిక్కుతోసట్లేదని బాధిత రైతులు ఆవేదన చెందుతూ అవకతవకలు" జరిగితే ఆత్మహత్యలే చరణం అంటూ ఆవేదనలో బాధిత రైతులు. పేర్లు అవకతవకలు జరిగితే ఊరుకునేది లేదని రైతు సంఘం నాయకులు హెచ్చరించారు.ఆశతో కోల్డ్ స్టోరేజీలో మిర్చి నిల్వ పెట్టారని అగ్ని ప్రమాదం మూలంగా రైతులు సర్వం కోల్పోయిన పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రైతులకు 100% ఇన్సూరెన్స్ వచ్చే విధంగా సహాయవ అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు మనోధైర్యం కల్పించి వాళ్లకి అడిగిన సమాచారం ఇవ్వాల్సిన ప్రభుత్వం ,ప్రభుత్వ అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే వారు ఇంకా ఎవరికి చెప్పుకోవాలని కష్ట కాలంలో రైతును అర్థం చేసుకొవలని వారికి సరైన సమాధానం చెప్పి కావాల్సిన పేర్లు లిస్టు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పోరాట కమిటీ నాయకులు మద్దాల ప్రభాకరరావు తేలప్రోలు రాధాకృష్ణ, ఇబ్రహీం, కొండేటి రాజేష్, సత్యనారాయణ రెడ్డి, నరసింహారావు తదితర బాధిత రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఎన్ఐ-ఎంఎస్ఎంఈ సంయుక్తంగా ఆవిష్కరణలు, పారిశ్రామికతకు ప్రోత్సాహం



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్రముఖ సంస్థ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (అఐ-ఎంఎవ) దేశవ్యాప్తంగా పారిశ్రామికతాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నదని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి సంబంధించిన విధానాల రూపకల్పనలో ప్రభుత్వానికి సహకరించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ నేపథ్యంలో అఐ-ఎంఎవ డైరెక్టర్ (ఎస్ఈడీ) శ్రీ కె. సూర్యప్రకాశ్ గౌడ్ తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డిని కలిసి సంయుక్త కార్యాచరణకు సంబంధించిన ప్రతిపాదిత రూపకల్పనను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ, ఉన్నత విద్యా పాఠ్యాంశాల్లో టెక్నాలజీ ఌ ఎథిక్స్ పరిచయం, అప్లైడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై అధునాతన కోర్సులు ప్రవేశపెట్టడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులకు తగిన అకడమిక్ క్రెడిట్లు కేటాయిస్తూ బిజినెస్ పరిచయం, స్టార్టప్‌లు, లా-గవర్నెన్స్-పాలసీ, అనుభవాత్మక అభ్యాసం వంటి మాడ్యూల్స్‌ను ప్రవేశపెట్టాలని సూచించారు. అనుభవాత్మక అభ్యాసం కింద తప్పనిసరి విద్యార్థి ఇంటర్న్‌షిప్‌లు, రంగాల వారీగా ప్రాజెక్టులు, కేస్ స్టడీస్, ఫీల్డ్ వర్క్ వంటి అంశాలను అమలు చేయడం ద్వారా విద్యార్థుల్లో ప్రాయోగిక నైపుణ్యాలు పెంపొందుతాయని, వీటికి తగిన క్రెడిట్లు కేటాయిస్తే విద్యార్థులు మరింత ఉత్సాహంతో ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత కళాశాలల్లో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ మోడల్‌లో కొత్త ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అఐ-ఎంఎవ సిద్ధంగా ఉందని తెలిపారు. వీటి ద్వారా గ్రామీణ ఉపాధి అవకాశాల పెంపుకు అవసరమైన జీవనోపాధి నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, అనుభవాత్మక అభ్యాస కార్యక్రమాలు అందించనున్నట్లు వెల్లడించారు. అదనంగా, జిల్లాస్థాయిలో పరిశ్రమల భాగస్వామ్యంతో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపనకు చర్యలు తీసుకుంటామని, తెలంగాణ వ్యాప్తంగా స్టార్టప్‌లను అనుసంధానం చేస్తామని చెప్పారు. అలాగే అధ్యాపకుల సామర్థ్యాభివృద్ధి కోసం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. టీజీసీహెచ్ఈ ఎంఎవ మధ్య ప్రతిపాదిత భాగస్వామ్యం రాష్ట్ర ఉన్నత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, పరిశ్రమలతో విద్యా సంస్థల అనుసంధానాన్ని పెంచి విద్యార్థుల ఉపాధి అవకాశాలను మరింత విస్తరింపజేస్తుందని ఇరువర్గాలు అభిప్రాయపడ్డాయి.

# సామరస్య వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలి : సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రానున్న బక్రీద్ పండుగను శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో సోమవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మత పెద్దలు, ప్రజలు పరస్పర సహకారంతో వ్యవహరించాలని కోరారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే సంఘ వ్యతిరేక శక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారని, అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా గత 45 రోజులుగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పోలీసులు పనిచేస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ న్యూస్, పాత వీడియోలు, తప్పుడు ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద సమాచారం గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100కు సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి మాట్లాడుతూ మత పెద్దలు సూచించిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వానికి భారత్ ప్రతీకగా నిలుస్తోందని, అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో పండుగలు జరుపుకోవాలని కోరారు. పండుగ సమయంలో పరిశుభ్రత, శానిటేషన్ విషయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటారని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాల్లో యువత, వాలంటీర్లు పోలీసులకు సహకరించాలని కోరారు. కూకట్‌పల్లి డీసీపీ రీతిరాజ్ మాట్లాడుతూ శాంతి కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సమాజంలో సామరస్యాన్ని కాపాడాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సిఎంసీతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ అధికారులతో పాటు హిందూ, ముస్లిం మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మండలంలో ప్రారంభమైన మహిళా వారోత్సవాలు చెంజర్లలో మహిళా సంఘ భవనానికి భూమి పూజ





**మానకొండూర్, మే25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వారంరోజుల పాటు నిర్వహించే మహిళా వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళల సాధికారత, ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చెంజర్లలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంఘ భవనానికి భూమిపూజ నిర్వహించారు. ఏపిఎం రాజేందర్ మాట్లాడుతూ..... ప్రత్యేక భవనాల ద్వారా సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకై మహిళా సంఘాలకు మరింత సౌకర్యం కలగనుందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ మహిళా సంఘాల బలోపేతంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని తెలిపారు. సీసీ జ్యోతి, పంచాయతీ రాజ్ ఏఈ వెంకన్న, ఎంపీఓ సత్తీష్ కుమార్, సర్పంచ్ గొల్లెన కనకవ్వ, ఉప సర్పంచ్ గడ్డి గణేష్, వార్డు సభ్యులు, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,కారోబార్ నర్సయ్య, మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఈదురు గాలులకు అస్తవ్యస్తమైన ఇల్లంతకుంట



**ఇల్లంతకుంట, మే25(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో సోమవారం సాయంత్రం హఠాత్తుగా వీచిన భారీ ఈదురు గాలులు, అకాల వర్షం కారణంగా గాలిపల్లి, పత్తికింటపల్లి గ్రామాల్లో తీవ్ర ఆస్తి, పంట నష్టం సంభవించింది. గంటల పాటు సాగిన తుఫాను లాంటి వాతావరణంతో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. బలమైన గాలుల ధాటికి పలు ఇళ్ల పైకప్పు రేకులు గాల్లోకి ఎగిరిపోయాయి. పెద్ద పెద్ద వృక్షాలు, విద్యుత్ స్తంభాలు విరిగి రహదారులపై పడటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా స్తంభించింది. కాగా, గాలివాన తీవ్రతకు ఓ భారీ ట్రాక్టర్ గాల్లోకి లేచి నిలిచిపోయిన దృశ్యం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. పత్తికింటపల్లికి చెందిన చింతలపల్లి సత్తిరెడ్డి అనే వ్యక్తి ఈదురు గాలుల ధాటికి గురై తీవ్రంగా గాయపడగా స్థానికులు గమనించి తక్షణమే ఆసుపత్రికి తరలించారు. అకాల వర్షంతో ఐకేపీ కేంద్రాల్లో ఓపెన్ క్యాప్‌లలో నిల్వ ఉంచిన వరి ధాన్యం రాశులు పూర్తిగా తడిసి ముద్దవగా కోలుకోలేని దెబ్బ తీసి తమకు వర్షం మరింత శాపంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి మండలంలో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవడంతో పాటు తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# గంగారాం పెద్ద చెరువు కబ్జాలతో కుచించుకుపోతోంది : రగిరి సాయిరాం గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఒకప్పుడు 113 ఎకరాల్లో విస్తరించి ఉన్న గంగారాం పెద్ద చెరువు ప్రస్తుతం కబ్జాలకు గురై సగానికి పైగా కుచించుకుపోయిందని బీజేపీ యువనేత రగిరి సాయిరాం గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెరువులో నీరు లేకపోవడంతో పరిసర కాలనీల్లో బోర్లు ఎండిపోతున్నాయని, ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సుందరీకరణ పేరుతో అసలు ఏం జరుగుతుందో ప్రజలకు అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. చెరువు పరిరక్షణ విషయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. చెరువు భూములు ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. వెంటనే గంగారాం చెరువు సుందరీకరణ పనులను పారదర్శకంగా చేపట్టడంతో పాటు, అక్రమంగా ఆక్రమించుకున్న చెరువు భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చెరువు భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, అధికారులను కోరారు. ప్రజల నీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

# కరీంనగర్ పట్టణంలో పోలీసుల ముమ్మర తనిఖీలు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



**కరీంనగర్ టౌన్, మే25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సోమవారం రాత్రి పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. సీపీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు, ఏసీపీ టౌన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్‌తో కలిసి నగరంలోని పలు లాడ్జీలు, పాన్ షాపులు, రవాణా కార్యాలయాలో అకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లాడ్జీలలో తలదాచుకుంటున్న వారి వివరాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాన్ షాపుల్లో ఎలాంటి నిషేధిత పదార్థాలు విక్రయించకుండా తనిఖీలు చేశారు. అలాగే ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులలో అనుమానాస్పద పార్సిళ్లు, వస్తువులపై డాగ్ స్క్వాడ్ సహాయంతో సోదాలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఉన్నతాధికారులు సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గస్తీని మరింత ఉధృతం చేయాలని ఆదేశించారు. కాగా, ఈ రాత్రి నిర్వహించిన ముమ్మర సోదాల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలుగానీ, వ్యక్తులుగానీ పట్టుబడలేదని అధికారులు వెల్లడించారు. నగర ప్రజల భద్రత కోసం ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. ఈ తనిఖీల్లో ఏసీపీ టౌన్, వెంకటస్వామి, ఎస్సై చేరాలు డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వేజి



# యువతలో కొత్త పిచ్చి.. ఆ సెలబ్రిటీల వల్లే!

బాలీవుడ్ సినీ తారలు భారతదేశంలో ఫ్యాషన్, హెయిర్‌స్టైల్స్.. ఇలా ప్రతీ దాంట్లోనూ ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తున్నారు . ముఖ్యంగా హెయిర్ కలర్ ట్రెండ్స్‌లో ఈ ప్రభావం కనిపిస్తుంది. సినీ తారలు తరచుగా రకరకాల కొత్త హెయిర్ కలర్స్‌తో ప్రయోగాలు చేస్తుంటారు. దీన్ని చూసి తమ అభిమాన తారలను అనుకరించాలనుకునే అభిమానుల మధ్య ఈ ట్రెండ్ మరింత పాపులర్ అవుతుంది. సెలబ్రిటీల ప్రభావం దీపికా పదుకొణె, ప్రియాంక చోప్రా లాంటి నటీమణులు రకరకాల హెయిర్ కలర్స్‌లో కనిపించి ప్రజల్లో ఆసక్తిని పెంచారు. వారి ఈ ఎంపికలు దేశవ్యాప్తంగా సెలూన్లలో అలాంటి కలర్స్‌కు డిమాండ్ పెరిగేలా చేశాయి. ఈ పరిణామం అందాన్ని నిర్వచించడంలో, దాని ప్రమాణాలను నిర్దేశించడంలో బాలీవుడ్ పాత్ర ఎంత కీలకమో చూపిస్తుంది. ముఖ్యంగా యువత వీరి హెయిర్ కలర్ ట్రెండ్ కు అలవాటై ప్రజాదరణ పొందిన షేడ్స్ బాలీవుడ్ స్ఫూర్తితో పాపులర్ అయిన కొన్ని హెయిర్ కలర్స్‌లో కారమెల్ బ్రౌన్, బర్గండీ, హనీ బ్లాండ్ వంటివి ఉన్నాయి. ఈ కలర్స్ చాలా వెర్సటైల్‌గా ఉండటం వల్ల, వివిధ రకాల స్కిన్ టోన్లకు బాగా సరిపోవడం వల్ల తారలు తరచుగా వీటిని ఎంచుకుంటారు. దీనితో, తమ లుక్‌ను మార్చుకోవాలనుకునే చాలామందికి ఇవి ఫస్ట్ ఛాయిస్‌గా మారాయి. బాలీవుడ్ సెలబ్రిటీ హెయిర్ కలర్స్ తో సెలూన్లపై ప్రభావం బాలీవుడ్ ప్రభావం సెలూన్లపైనా పడుతుంది. చాలామంది నుండి సెలబ్రిటీలు వాడే హెయిర్ కలర్స్ కావాలంటూ అభ్యర్థనలు పెరుగుతున్నాయని స్టైలిస్టులు చెప్తున్నారు. ఈ ట్రెండ్ వల్ల వ్యాపారం మాత్రమే పెరగడం లేదు, స్క్రీన్‌పై కనిపించే సరికొత్త లుక్‌లను తిరిగి సృష్టించడానికి నిపుణులు ప్రయత్నించడంతో కొత్త ఆవిష్కరణలకు కూడా ప్రోత్సాహం లభిస్తోంది. %ూశ్రీంశీ =ఘు౦% ఈసీజీ చూసి గుండె ఆరోగ్యంగా ఉందని నమ్ముతున్నారా? అలెర్ట్! హెయిర్ కలరింగ్ లో సోషల్ మీడియా పాత్ర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు హెయిర్ కలర్ ట్రెండ్స్‌పై బాలీవుడ్ ప్రభావాన్ని మరింత పెంచుతున్నాయి. అభిమానులు తమ అభిమాన తారల హెయిర్‌స్టైల్స్ ఫోటోలను షేర్ చేసుకుంటూ, ఈ ట్రెండ్స్‌ను మరింత విస్తరిస్తున్నారు. ఈ డిజిటల్ ప్రచారం వల్ల కొత్త స్టైల్స్, కలర్లను వివిధ వర్గాల ప్రజలు త్వరగా ఎంచుకుంటున్నారు. అయితే మంచిగా నేచురల కలర్ తో ఉన్న జుట్టును ఈ రంగులతో అనవసరం గా పాడు చేసుకుంటున్నారని పలువురు ఈ పోకడ చూసి భావిస్తున్నారు.


# వీటితో కిడ్నీలు క్లీన్‌గా, ఆరోగ్యంగా



మన శరీరంలో కిడ్నీలు చాలా ముఖ్యమైన అవయవాలు. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. కొన్ని ఆహారాలు కిడ్నీల పనితీరును మెరుగుపరచడానికి, టాక్సిన్స్ తొలగించడానికి అవసరమవుతాయి. కొన్ని రకాల పానీయాలు కూడా మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచడానికి దోహదం చేస్తాయి. మరి మూత్రపిండాల ఆరోగ్యం కోసం దోహదం చేసే డిటాక్స్ ఫుడ్స్ మరియు డ్రింక్స్ గురించి ప్రస్తుతం తెలుసుకుందాం. కిడ్నీల ఆరోగ్యానికి కీరా దోస ఆరోగ్యాన్ని కాపాడడంలో కీరదోస బాగా పనిచేస్తుంది. కీరదోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల అది మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తూ వాటిని శు భ్రపరుస్తుంది. కీర దోసకాయలో ఉండే పోషకాలు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా నిరోధించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. క్రమం తప్పకుండా కీర దోసకాయ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగుపడుతుంది. కిడ్నీల ఆరోగ్యానికి సిట్రస్ పండ్లు సిట్రస్ పండ్లు కూడా కిడ్నీల ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లు శరీరానికి హైడ్రేషన్ ను అందిస్తాయి. శరీరంలో నుండి విష పదార్థాలను బయటకు పంపడానికి దోహదం చేస్తాయి. ఇవి మూత్రపిండాలలో రాళ్లు రాకుండా చేస్తాయి. నిత్యం ఈ పండ్లను తీసుకోవడం వల్ల మూత్రంలో సిట్రిక్ స్థాయిలను మెరుగుపరిచి, కిడ్నీల సామర్థ్యం పెరుగుతుంది. వీటితో కిడ్నీల ఆరోగ్యం సాల్మన్, ట్యూనా వంటి కొవ్వు చేపలు కూడా కిడ్నీల ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. ఇవి కిడ్నీల పనితీరును మెరుగుపరిచి ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. వీటిలో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ మన శరీరంలో కొవ్వు స్థాయిలను తగ్గించి రక్తపోటును నియంత్రిస్తాయి. ఫలితంగా సహజంగానే మూత్రపిండాలకు ఇవి రక్షణ కవచంలా నిలుస్తాయి. ఇవి తాగితే కిడ్నీలలో టాక్సిన్స్ బయటకు ఇక కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే కిడ్నీలలో విషపదార్థాలు తొలగిపోవాలంటే తగినంత నీటిని తీసుకోవడం ఎంతో అవసరం. ప్రతిరోజు నీటిని తగినంత తీసుకోవడం వల్ల మూత్రపిండాలు శుభ్రపడతాయి. ఇవి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపిస్తాయి. కిడ్నీలలో రాళ్లు ఏర్పడకుండా నిరోధించడంలో నీళ్లు కీలక భూమిక పోషిస్తాయి. కనక కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు కచ్చితంగా ఈ ఆహారాలు, పానీయాలను తీసుకుంటే మంచిది

## తులసి ఆకుల నీళ్లను తాగండి
# ఈ సమస్యలకు సూపర్ మెడిసిన్..!!

తులసికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇమ్యూనిటీ పవర్‌ను పెంచేందుకు గాను తులసి ఆకులు ఎంతగానో పనిచేస్తాయి. ఆయుర్వేదంలో తులసి ఆకుల తో ప్రయోజనాలను వివరించారు. తులసి ఆకులతో తయారు చేసే నీళ్లను తాగడం వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. తులసి ఆకుల నీరు తీసుకోవటం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గటం తో పాటుగా శ్వాస కోస వ్యాధులు తగ్గిచుకోవచ్చు. మధుమేహ వ్యాధి గ్రస్తులకు తులసి ఆకుల నీరు ఎంతో ప్రయోజనకరమని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. తులసి ఆకులతో ఎన్నో ఆరోగ్య పరమైన లాభాలు ఉన్నాయి. ఒకపాత్రలో కొన్ని నీళ్లను తీసుకుని అందులో కొన్ని తులసి ఆకులను వేసి మరిగించాలి. నీరు బాగా మరిగిన తరువాత వడకట్టి అందులో కొద్దిగా తేనె కలిపి తాగాలి. ఇలా తులసి ఆకుల నీళ్లను రోజుకు 2 సార్లు తాగితే అనేక ప్రయోజనాలను పొందవచ్చు. తులసి ఆకుల్లో అడాప్టోజెనిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ ఆకులతో నీళ్లను తయారు చేసి తాగితే ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. డిప్రెషన్, ఆందోళన ఉన్నవారు రోజూ ఈ నీళ్లను తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. తులసి ఆకులు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతగానో సహాయం చేస్తాయి. తల్లుల ఖాతాల్లో నేరుగా రూ 1,800 జమ – అర్హతలు, ఉత్తర్వులు..!! తులసి ఆకులతో నీళ్లను తయారు చేసి తాగితే పలు జీర్ణాశయ ఎంజైమ్‌ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. అలాగే కడుపు ఉబ్బరం, అజీర్తి, గుండెల్లో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలో ఏర్పడిన అసౌకర్యం తొలగిపోతుంది. ఈ ఆకుల నీళ్లను తాగుతుంటే శ్వాస నాళాల్లో, గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. తులసి ఆకుల్లో షుగర్ లెవల్స్‌ను తగ్గించే సమ్మేళనాలు ఉంటాయి. ఈ ఆకుల్లో అనేక రకాల ఫైటో కెమికల్స్



ఉంటాయి. ఇవి ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచేలా చేయడం తోపాటు ఇన్సులిన్‌ను శరీరం సరిగ్గా ఉపయోగించుకునేలా చేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. తులసి ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. బీపీ నియంత్రణలో ఉంటుంది.

## మార్కెట్

# కష్టాల్లో పౌల్ట్రీ పరిశ్రమ.. సమస్యల్లో పెంపకందారులు

### ఐకార్, డీపీఆర్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ : రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగంగా ఉంటూ ఉపాధి, ఆదాయాలపరంగా పెద్దదైన కోళ్ల పెంపకం పరిశ్రమ.. పెను సమస్యలను ఎదురొంటోందని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్), పౌల్ట్రీ పరిశోధన డైరెక్టరేట్ (డీపీఆర్) అధ్యయనంలో వెల్లడైంది. వ్యాధి నిర్ధారణ కేంద్రాలకు, వైద్య సిబ్బంది కొరత ఉందని, టీకాలు తగినన్ని అందుబాటులో లేవని గుర్తించింది. గుడ్లు, చికెన్ ధరలలో అస్థిరత్వం ఈ రంగం ఎదుగుదలకు ప్రతిబంధకంగా మారినట్టు డీపీఆర్ తాజా నివేదికను విడుదల చేసింది.

5 లక్షలమందికి ఉపాధి..

దేశీయంగా కోళ్లు, గుడ్ల ఉత్పత్తి, మాంసం లభ్యతలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందని డీపీఆర్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇక్కడ 5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని పేర్కొంది. దేశంలోని కోళ్లలో రాష్ట్రంలోనే 9.39 శాతం ఉన్నాయి. రోజుకు 1,397.2 టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతుండగా.. సగటున 5.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్టు తేలింది. అయితే వాణిజ్య కోళ్ల పెంపకం ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ విధానాలతో కొనసాగుతుండగా.. నాటుకోళ్ల పెంపకం అసంఘటితంగా ఉన్నట్టు వెల్లడించింది. నిర్వహణలోనూ సంరక్షణ, మారెటింగ్ సమస్యలు ఎదురవుతున్నట్టు అధ్యయనం గుర్తించింది. రాష్ట్రంలో దాణా, పోషక విలువల పరిశీలన, పోషకాహార లోపాన్ని గుర్తించడానికి అవసరమైన ప్రయోగశాలలు సైతం అందుబాటులో లేవన్నది.



# 100 శాతం టారిఫ్‌లపై మాట మార్చిన ట్రంప్..



అలాంటి శాతాలేవీ తాను చెప్పలేదని వ్యాఖ్య రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా టారిఫ్‌ల బాంబు పేలుస్తున్నారు. భారత్ సహా ప్రపంచ దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. ఇందులో భాగంగానే రష్యాతో వ్యాపారం చేస్తున్న దేశాలపై భారీగా సుంకాలు విధిస్తానని హెచ్చరించిన విషయం తెలిసిందే. మాస్కోతో చమురు వాణిజ్యం చేస్తే భారత్ సహా ఆయా దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తానంటూ గత కొంతకాలంగా తీవ్రంగా హెచ్చరిస్తూ వస్తున్నారు. అయితే, దీనిపై ట్రంప్ తాజాగా మాట మార్చారు. అదనపు టారిఫ్‌లపై అలాంటి శాతాలేవీ తాను చెప్పలేదని వెల్లడించారు. వైట్‌హౌస్‌లో మీడియా సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. అదనపు టారిఫ్‌లపై తానెప్పుడు శాతాల గురించి చెప్పలేదన్నారు. దానిపై కసరత్తు చేస్తున్నామని, ఏం జరుగుతుందో చూడాలని వ్యాఖ్యానించారు. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. బుధవారం రష్యాతో సమావేశం ఉందని.. అందులో ఏం జరుగుతుందో చూడాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ట్రంప్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

24 గంటల్లో అదనపు సుంకాలు.. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన అక్కసును వెళ్లగక్కారు. 24 గంటల్లోగా భారత్‌పై అదనపు సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ మంగళవారం హెచ్చరించారు. భారత్ మంచి వాణిజ్య భాగస్వామి కాదు. ఎందుకంటే వారు (భారత్) మాతో వ్యాపారం చేస్తున్నారే కాని మేము వారితో వ్యాపారం చేయడం లేదు. అందుకే 25 శాతం సుంకాలు విధించాలని నిర్ణయించాం. అయితే రానున్న 24 గంటల్లోగా దీన్ని గణనీయంగా పెంచదలచుకున్నాను. ఎందుకంటే వారు రష్యన్ చమురు కొంటున్నారు. యుద్ధానికి ఆజ్యం పోస్తున్నారు అని మంగళవారం సీఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యానించారు.



# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 166 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్..!

దేశీయ స్టాక్ మార్కెట్‌లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనాలకు అనుగుణంగా కీలక వడ్డీ రేట్లను యథావిధిగా కొనసాగించింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 5.5 శాతం వద్దే ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ ప్రస్తుతం ఉన్న 5.5 శాతం రెపోరేటు కొనసాగుతుందని ప్రకటించారు. ఇదిలా ఉండగా.. దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఉదయం 80,694.98 ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 80,834.43 పాయింట్ల గరిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,448.82 పాయింట్లకు పడిపోయింది. చివరకు 166.26 పతనమై.. 80,543.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 75.35 పాయింట్లు తగ్గి 24,574.20 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం తగ్గాయి. నిఫ్టీలో విప్రో, సన్ ఫార్మా, జియో ఫైనాన్షియల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా అత్యధికంగా నష్టపోగా.. ఏషియన్ పేయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ లాభపడ్డాయి. పీఎస్‌యూ బ్యాంక్ (0.6 శాతం) మినహా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మీడియా, రియాల్టీ, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ ఒకటి నుంచి 2శాతం తగ్గాయి. ఇతర రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి.

# అభివృద్ధిని తట్టుకోలేక జగన్ అక్కసు

## రాష్ట్రానికి హనీమూన్ నాయకుడు

## జగన్ తీరుపై మండిపడ్డ మండిపల్లి

అమరావతి : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రానికి హనీమూన్ నాయకుడని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభివర్ణించారు. పాత సారాని కొత్త సీసాలో నింపి మార్కెటింగ్ చేసినట్లు వైఎస్ జగన్ వ్యవహారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఓర్వలేక నిత్యం అక్కసు వెళ్లగక్కుతున్నాడంటూ జగన్‌పై ఆయన మండిపడ్డారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. విజయలక్ష్మి మినరల్స్‌తో మైనింగ్ దోపిడీ ప్రారంభించి.. భారతీ సిమెంట్స్, సండూర్ పవర్ వరకూ విస్తరించారని వివరించారు. దోపిడీ, బెదిరింపులు, మోసం చేసి.. సంపాదించిన నగదును రాజకీయాల్లో పెట్టి ఎదిగారని చెప్పారు. బలపనూరు నుంచి ప్రారంభమైన వైఎస్ కుటుంబ ప్రస్థానం రూ. లక్షల కోట్ల అవినీతి సామ్రాజ్యంగా విస్తరించిందని రవాణా శాఖ మంత్రి పేర్కొన్నారు. చెల్లని రూపాయిగా మారిన వైఎస్ జగన్‌ను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. జగన్‌తో పాటు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి వచ్చి మంచి సలహాలు ఇస్తే.. వాటిని స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఊళ్ళో పెళ్లికి కుక్కల హడావుడి అనే రీతిలో మహానాడు ప్రారంభం రోజు వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసిందని వ్యంగ్యంగా అన్నారు. వైఎస్ జగన్ నిర్వహించే ఈ కార్యక్రమం మహానాడుకు దిష్టిచుక్క లాంటిదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

# స్థల వివాదాంలో జోగయ్య కుమారుడి బెదరింపులు

## కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గేయరచయిత అనంతశ్రీరామ్

భీమవరం,మే25 : తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందంటూ పశ్చిమగోదావరి జిల్లా ఉన్నతాధికారులను ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ ఆశ్రయించారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా ముఖ్య కేంద్రం భీమవరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో అనంత శ్రీరామ్ ఈ ఫిర్యాదు చేశారు. పాలకొల్లు సమీపంలోని యలమంచిలి మండలం దొడ్డిపట్లలో తమ ఇంటి ముందున్న ఐదు సెంట్ల ఉమ్మడి స్థలాన్ని ఆక్రమించారంటూ ఆయన తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ స్థల వివాదం ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. ఈ స్థలం కోసం మాజీ ఎంపీ హరి రామజోగయ్య కుమారుడు సూర్యప్రకాశ్ తన తల్లిదండ్రులను బెదిరింపులకు గురి చేస్తూ.. వారిని మానసికంగా హింసకు గురి చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో అనంత శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీకి అనంత శ్రీరామ్ ఫిర్యాదు చేశారు. వారికి రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను అనంత శ్రీరామ్ కోరారు.

# శ్రీవారిని దర్శంచుకున్న రామ్మోహన్ నాయుడు

## స్వామి దర్శనం చేయించి తీర్థప్రాసాలు అందచేత

తిరుమల,మే25 : తిరుమల వేంకటేశ్వరస్వామిని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం ఆలయ అధికారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆదివారం కాలినడకన ఆయన తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తిరుమలకు వచ్చే భక్తులు తాగునీరు, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని తెలిపారు. తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగినా టీటీడీ చేపడుతున్న ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని కేంద్రమంత్రి ప్రశంసించారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు సమర్థవంతంగా సేవలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని వసతులు సమృద్ధిగా ఉండటంతో భక్తులు ఆనందంగా శ్రీవారిని దర్శించుకుంటు న్నారని తెలిపారు. తిరుమలలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం, టీటీడీ కలిసి కృషి చేస్తున్నాయని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# 123 మున్సిపాలిటీల్లో 14వందల కోట్లతో డ్రైనేజీలు

## మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి

నెల్లూరు,మే25 : ఏపీలోని 123 మున్సిపాల్టీల్లో రూ.14వందల కోట్లతో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో పలు మున్సిపల్ స్కూళ్లను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైబ్రిడ్ ద్వారా మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో మహానాడు మాదిరిగానే తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని చెప్పారు. కచ్చితంగా కార్యకర్తలకు మాట్లాడే అవకాశం ఉంటుందని అన్నారు. నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తచరిత్ర ఎవరిదో ఏపీ ప్రజలందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. జగన్ అండ్ కో అసత్యాలు మాట్లాడేస్తే జనం నమ్మరని అన్నారు. రక్తచరిత్ర తెలుసు కాబట్టే గత ఎన్నికల్లో వైసీపీని 11సీట్లకు ప్రజలు పరిమితం చేశారని.. ఈ సారి జీరో తప్పదని హెచ్చరించారు. తమ ప్రభుత్వంపై కావాలని జగన్ అండ్ కో అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఎందుకు వినియోగించలేదని ప్రశ్నించారు. చివరకు స్వచ్ఛభారత్ నిధులను కూడా వినియోగించలేదని ఆగ్రహించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, నిజాయతీగా పోస్టులు కేటాయించారని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంపై జగన్ అండ్ కో విమర్శలు చేయడం దారుణమని దుయ్యబట్టారు.

# పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

## అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

న్యూఢిల్లీ,మే25 : అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరమూ లేదని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశంలో ఉన్న రుబియో మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకాబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన రుబియో.. భారత్, పాక్ సంబంధాల గురించి స్పందించారు. 'భారత్‌కు పాకిస్థాన్ విషయంలో ఉన్న ప్రధాన ఆందోళనలు ఉగ్రవాద సంస్థల గురించే. వాటికి ఇరాన్ చర్చల్లో పాకిస్థాన్ పాత్రతో సంబంధం లేదు.

# అధికారంలోకి వస్తామని పగటి కలలు

## కులాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం

## జగన్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే ధూళిపాళ్ల



గుంటూరు,మే25 : కులాల మధ్య చిచ్చుపెట్టడమే వైకాపా నేతల పని అని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. వైకాపా హయాంలో బడుగువర్గాలపై దాడులు చేశారని అన్నారు. గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక చర్యల వల్లే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేశారని విమర్శించారు. ప్రజల తీర్పు చూసిన తర్వాత కూడా వైకాపా నేతల్లో మార్పు రాలేదు. వివాదాలు సృష్టించి యువతను కేసుల్లో ఇరికిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేశారు. జడ్జిలు, వాళ్ల కుటుంబసభ్యులపైనా దుష్ప్రచారం చేశారు. మాట వినలేదని అనేక మందిని హత్య చేశారు. ప్రజలు అధికారం ఇవ్వలేదనే అక్కసుతో దాడులకు పాల్పడుతున్నారు. ఎక్కిడికి వెళ్లినా డ్రామాలు ఆడటమే వైకాపా నేతల పని అని ధూళిపాళ్ల అన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాల మధ్య చిచ్చుపెట్టడమే జగన్ అండ్ కో పని అని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో బడుగువర్గాలపై దాడులు చేశారని ఆరోపించారు. ప్రజల తీర్పు చూసిన తర్వాత కూడా వైసీపీ నేతల్లో మార్పు రాలేదని ఎమ్మెల్యే ధూళిపాళ్ల ÷ర్ అయ్యారు. వివాదాలు సృష్టించి యువతను పలు కేసుల్లో ఇరికిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ అండ్ కో మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేశారని ఆరోపించారు. జడ్జిలు, వాళ్ల కుటుంబసభ్యులపైనా కూడా దుష్ప్రచారం చేశారని ఆగ్రహించారు. జగన్ అండ్ కో మాట వినలేదని అనేకమందిని హత్య చేశారని ఆరోపించారు. ప్రజలు అధికారం ఇవ్వలేదనే అక్కసుతోనే ఈ దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికి వెళ్లినా డ్రామాలు ఆడటమే వైసీపీ నేతలు పనిగా పెట్టుకున్నారని సెటైర్లు గుప్పించారు. మొక్కజొన్న రైతన్నలకు న్యాయం చేయాలని అడిగితే తప్పు లేదని.. కానీ రైతుల పేరుతో దీక్ష పెట్టి తనపై, సంగం డెయిరీపై వైసీపీ నేతలు విమర్శలు చేశారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దుయ్యబట్టారు. గత 15 ఏళ్లుగా డెయిరీ అవసరాల కోసం మొక్కజొన్న కొంటున్నామని ప్రస్తావించారు. ప్రభుత్వాలపై ఆధారపడి తాము వ్యాపారం చేయటం లేదని స్పష్టం చేశారు. మొక్కజొన్న కొనాలంటే కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. మొక్కజొన్న త్వరగా కొనాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారని చెప్పుకొచ్చారు. జగన్ రాజకీయ లబ్ధి కోసం అన్నదాతలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. మహిళలను రోడ్లపైకి రెచ్చగొట్టి పంపించి వారిపై కేసులకు కారణం అయ్యారని అన్నారు. అంబటి మురళి తన రాజకీయ అవసరాల కోసం మహిళలను రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

## ఫల్తా గెలుపుతో టిఎంసికి బీటలు

కోల్‌కతా,మే25 : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఊహించని భారీ కుదుపు చోటుచేసుకుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫల్తా' అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉత్కంఠభరిత రీపోలింగ్‌లో భారతీయ జనతా పార్టీ అఖండ విజయాన్ని నమోదు చేసింది. ఈ రీపోలింగ్‌లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా ఏకంగా 1,08,000 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచి సంచలనం సృష్టించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ తగిలి ఏకంగా నాలుగో స్థానానికి పడిపోయింది. ఇక్కడి అభ్యర్థి పోలింగ్‌కు ముందే చేతులెత్తేశారు. విజయం సాధారణమైనది కాదు.. ఎందుకంటే ఫల్తా నియోజకవర్గం టీఎంసీ నెంబర్-2, ఎంపీ అభిషేక్ బెనర్జీకి చెందిన 'డైమండ్ హార్బర్' లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. ఒకప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌కు తిరుగులేని కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో కమలం వికసించడం.. బెంగాల్ రాజకీయాల్లో ఇక మమతా బెనర్జీ మార్క్ హవాకు బ్రేకులు పడ్డాయనే సంకేతాన్ని స్పష్టంగా ఇస్తోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. స్థానానికి తొలిసారిగా ఏప్రిల్ 29న పోలింగ్ జరిగింది. అయితే ఆ సమయంలో అధికార టీఎంసీ ఈవీఎంల తారుమారుకు పాల్పడిందని, బూత్ క్యాప్చరింగ్, ఓటర్లను బెదిరించడం వంటి అక్రమాలకు ఒడిగట్టిందని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ స్థానంలో నెలకొన్న తీవ్రతను గమనించిన ఎన్నికల సంఘం (ఇఅ) అక్కడ జరిగిన పోలింగ్‌ను రద్దు చేసి, మే 21న కట్టుదిట్టమైన కేంద్ర బలగాల నిఘాలో మొత్తం 285 బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించింది. ఈసారి భయం లేకుండా దాదాపు 88 శాతం మంది ఓటర్లు తరలివచ్చి ప్రశాంతంగా ఓటు వేశారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచే బీజేపీ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. రౌండ్ రౌండ్‌కు మెజారిటీ పెరుగుతూ పోయింది.. ఈ రీపోలింగ్‌కు ముందే ఓటమిని పసిగట్టిన టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ తాను పోటీలో నిలబడనని ముఖం చాటేయడం గమనార్హం. అయితే చివరకు ఆయనకు ఈ ఎన్నికల్లో దక్కింది కేవలం 7 వేల పైచిలుకు ఓట్లే. ఈ ఘోర పరాజయాన్ని జీర్ణించుకోలేకపోతున్న మాజీ సీఎం మమతా బెనర్జీ రిజల్ట్స్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ ఏజెంట్లలా నటిస్తూ కేంద్ర బలగాలు కౌంటింగ్ కేంద్రాల్లోకి దూరి ఓట్లను మళ్లీ దొంగిలించాయని అంటూ ఆమె మండిపడ్డారు. మరోవైపు ఈ ఘనవిజయంపై పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి స్పందిస్తూ.. టీఎంసీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అభిషేక్ బెనర్జీ చెప్తుండే 'డైమండ్ హార్బర్ మోడల్' కాస్తా ఇప్పుడు 'తృణమూల్ నష్ట నమూనా'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. తాను ప్రజలను లక్ష మెజారిటీ అడిగితే.. వారు 1.08 లక్షల మెజారిటీతో నమ్మకాన్ని నిలబెట్టారని, ఫల్తా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మళ్లీ 'స్వర్ణ వైభవాన్ని' తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు.

# పెట్రో ధరల భారాన్ని తగ్గించండి

## వెంటనే వ్యాట్ తగ్గించడమే పరిష్కారం

## సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ

హైదరాబాద్,మే25 : కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నేపథ్యంలో చోద్యం చూడటం మానేసి, వెంటనే రాష్ట్ర వ్యాట్ తగ్గించి, ప్రజలకు ఉపశమనం కలిగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ లేఖ రాశారు. 'పెట్రోల్, డీజిల్ ధరలు ప్రజల నడ్డి విరుస్తున్నాయి, రాష్ట్ర పన్నులు తగ్గించాలి'అని నాడు పీసీసీ హోదాలో ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, నేడు అధికారంలో ఉండి ఎందుకు వ్యాట్ తగ్గించడం లేదని లేదని నిలదీశారు. ప్రతిపక్షాలపై అడ్డగోలుగా మాటలు దంచుడు కాదు.. దమ్ముంటే మాట మీద నిలబడి పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలు దించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.వారంలో నాలుగు సార్లు ఫ్యూయల్ ధరలు పెంచి కేంద్రం ప్రజలపై పెను భారం మోపితే, మరోవైపు రేవంత్ రెడ్డి రాష్ట్ర పన్నులు తగ్గించకుండా ప్రజల నడ్డి విరిస్తున్నారని మండిపడ్డారు. పెరిగిన సాగు ఖర్చులు భరించలేక రైతులు సతమతమవుతుంటే, మరో వైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు రైతుల పరిస్థితి తయారైందన్నారు.రవాణా రంగం తీవ్ర సంక్షోభానికి లోను కావడంతో ద్రవ్యోల్బణం పెరిగి అన్ని వర్గాల ప్రజల జీవనంపై ప్రతికూల ప్రభావం పడుతున్నదన్నారు.పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, పన్నుల భారం వల్ల ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పొలం దున్నాలన్నా డీజిల్ భారం..సామాన్యుడు బైక్ తీయాలన్నా పెట్రోల్ భారం?ఆటో సోదరుడి బతుకు బండి నడవాలన్నా ఇంధన భారం.. పెరిగిన ధరలు ప్రజానీకానికి పెను శాపంగా మారిందన్నారు హరీశ్ రావు.పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు భరించలేక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉపశమన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు.పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన ప్రతిసారీ రేవంతు ప్రభుత్వం వ్యాట్ రూపంలో ఖజానా నింపుకుంటూ సంబుర పడుతుందని, పైశాచిక ఆనందం పొందుతుందన్నారు. పెరిగిన ధరలతో ప్రతి నెలా రూ.162 కోట్లు, ఏడాదికి దాదాపు 2,000 కోట్ల అదనపు వ్యాట్ ఆదాయం వస్తుంటే.. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విడిచి పెట్టి ప్రచారాలకే పెద్ద పీట వేస్తున్నది విమర్శించారు. ఎన్నికల ముందు వ్యాట్ పై విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, రెండున్నరేళ్లుగా కేనీసం 0.1శాతం వ్యాట్ కూడా తగ్గించకపోవడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక తీరు, అధికారంలోకి వచ్చాక మరొక తీరు వ్యవహరిస్తూ కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. నిజంగా ప్రజా పాలనే అయితే, వెంటనే పెట్రోల్, డీజిల్‌పై కనీసం 10? వ్యాట్ తగ్గించి, పెరిగిన ఇంధన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ పెంపుపై మొసలి కన్నీరు కార్చే రాహుల్ గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ వ్యాట్ దోపిడీపై స్పందించాలని, వ్యాట్ తగ్గించేలా రేవంత్ రెడ్డిని ఆదేశించాలని కోరారు.

# ముంచుకొస్తున్న ఎబోలా ముప్పు

## అప్రమత్తం అయిన కేంద్ర ప్రభుత్వం

## అధికారులతో సమీక్షించిన జెపి నడ్డా

న్యూఢిల్లీ,మే25 : ఎబోలా వైరస్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తాజాగా ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇక ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సూచనలు చేసింది. జ్వరం, వాంతులు, అకారణ రక్తస్రావం, తలనొప్పి, వంటి సమస్యలు తలెత్తిన వెంటనే ఎయిర్‌పోర్టు హెల్త్ ఆఫీసర్‌కు ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే వెల్లడించాలని స్పష్టం చేసింది. ఎబోలా కేసులు అధికంగా ఉన్న డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సుడాన్‌కు వెళ్లవద్దని కేంద్రం ఇప్పటికే భారతీయులకు సూచించింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల్లో నిఘాను కట్టుదిట్టం చేశారు. లెబొరేటరీలు, క్వారంటైన్ వసతులను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు, ఆఫ్రికాలో ఇప్పటివరకూ 900లకు పైగా ఎబోలా అనుమానిత కేసులు వెలుగు చూశాయని డబ్ల్యూహెచ్ఓ తాజాగా వెల్లడించింది. 101 కేసుల్లో ఇప్పటికే వ్యాధి నిర్ధారణ అయ్యిందని వెల్లడించింది. ఇక యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ప్రకారం, ఎబోలా వ్యాప్తి ఎక్కువగా ఉన్న డీఆర్సీ దేశంలో 904 అనుమానిత కేసులు వెలుగులోకి రాగా 101 మంది రోగుల్లో ఎబోలా వ్యాధి నిర్ధారణ అయ్యింది. ఇప్పటికే 119 మంది ఎబోలా వల్లే మరణించినట్టు అనుమానాలు ఉన్నాయి. మరో 10 కేసుల్లో ఎబోలా వల్లే మరణాలు సంభించిందని కూడా పరీక్షల్లో తేలింది. మే 24 వరకూ ఉన్న వివరాల ప్రకారం, ఉగాండాలో 5 నిర్ధారిత కేసులు, ఒక ఎబోలా మరణం వెలుగులోకి వచ్చింది. ఆఫ్రికా దేశాల్లో జాతీయ స్థాయిలో ఎబోలా వ్యాప్తి చెందే రిస్క్ ఎక్కువగా ఉందని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది.

# ఇశాన్వీ నుంచి బయటకు వచ్చాం

## నోటీసులపై 27న వివరణ ఇస్తాం

## విజయవాడ ఎంపి కేశినేని చిన్ని

విజయవాడ,మే25 : ఇశాన్వీ, కేశినేని డెవలపర్స్ సనీస్థలు కలిసి చేసిన రియల్ ఎస్టేట్ సంస్థకు ఈడీ అధికారుల నుంచి ఓ నోటీసు వచ్చిందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆ కంపెనీకి వచ్చిన నోటీసుపై ఈనెల 27వ తేదీన వివరణ ఇస్తామని పేర్కొన్నారు. పక్క పక్క సైట్లు ఉండటంతో రాజ్ కసిరెడ్డికి సంబంధించిన ఇశాన్వీ సంస్థతో 2021లో రియల్ ఎస్టేట్ చేసేందుకు ప్రైడ్ ఇన్‌ఫ్రా సంస్థ ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. ఆ సంస్థ ద్వారా రూ.35 లక్షల లావాదేవీలు జరిగాయని తెలిపారు. సోమవారం విజయవాడలో కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడారు. రాజ్ కసిరెడ్డి సంగతి తెలిశాక 2022లోనే.. ఆ కంపెనీ నుంచి బయటకు వచ్చేశామని కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఆ లావాదేవీకి సంబంధించే ఈడీ అధికారులు సమాధానం కోరుతూ నోటీసు పంపించారని వెల్లడించారు. ఆర్కిటెక్ ఫీజు కోసం చేసిన రూ.35లక్షల ట్రాన్సాక్షన్ తప్ప ఇంకేమి జరగలేదని ఈడీ అధికారులకు చెబుతామని తెలిపారు. లిక్కర్ స్కామ్‌లో తన భార్యకు నోటీసులు వచ్చినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమని అన్నారు. అప్పుడు పెట్టిన కంపెనీలో తన భార్య ఒక డైరెక్టర్ మాత్రమేనని తేల్చిచెప్పారు. ఆ కంపెనీకి నోటీసు వచ్చిందే తప్ప.. తన భార్యకు ఎలాంటి నోటీసు రాలేదని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# భూదాన్ భూమలు బదిలీ వ్యవహారం

## ఇడి విచారణకు హాజరైన అమేయకుమార్

హైదరాబాద్,మే 25 : భూదాన్ భూముల వ్యవహారంలో ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్.. సోమవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. భూదాన్ భూముల వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణంలో ఐఏఎస్ అధికారిని ఈడీ విచారిస్తోంది. అమోయ్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో జరిగిన అక్రమ భూమి బదిలీలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. 2024లో అమోయ్ కుమార్‌ను పలుమార్లు ఈడీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం విచారణకు రావాల్సిందిగా ఐఏఎస్ అధికారికి ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. మూడు సేల్ డీడ్లు, బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలు అందజేయాలని నోటీసుల్లో పేర్కొంది. దీంతో ఈరోజు సేల్ డీడ్ వివరాలు, సంబంధిత డాక్యుమెంట్లతో అమోయ్ కుమార్.. ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో 2023లో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. నాగారం గ్రామ పరిధిలోని భూదాన్ భూములను అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 42 ఎకరాల భూమిని అక్రమంగా కట్టబెట్టి భారీ మొత్తంలో లాభాలు పొందినట్లు అమోయ్ కుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి.

# మహారాష్ట్రలో లోయలోకి దూసుకెళ్లిన స్కార్పియో

## ఎనిమిది మంది సంఘటనా స్థలంలోనే మృతి


ముంబై,మే25 : మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. రాయగఢ్‌లోని అంబెనాలి ఘాట్ సమీపంలో నదీ లోయలోకి స్కార్పియో వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను వెలికితీసేందుకు సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, మిగిలిన వారికోసం గాలిస్తున్నారు. మహాబలేశ్వర్, పొలాద్‌పూర్ మధ్య ఉన్న అంబెనాలి ఘాట్ వద్ద ఈ ఘోర ప్రమాదం జరిగింది.



# కేన్స్ ఫెస్టివల్‌లో మెరిసిన ఐశ్వర్య


ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన కంగనా

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ తన ఫ్యాషన్ లుక్‌తో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మెరిశారు. తన కుమార్తె ఆరాధ్యతో కలిసి రెడ్ కార్పెట్‌పై యలొలికించారు. అయితే, ఐశ్వర్య లుక్‌పై నెట్టింట కొన్ని విమర్శలు ఎదురవుతున్నాయి. వీటిపై ఐష్ స్పందించనప్పటికీ.. నటి కంగనా రనౌత్ ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఐశ్వర్య ఫొటోను తన ఇన్‌స్టాలో షేర్ చేసిన కంగన అద్భుతంగా ఉన్నారని ప్రశంసించారు. 'ఫ్యాషన్, స్టైల్ అనేది ఎవరికి నచ్చినట్లు వారు ఎంపిక చేసుకునేవి. వారి ఇష్టానికి, సౌకర్యానికి తగినట్లు ఉంటాయి. ఈ విషయంలో ఏ మహిళ కూడా ఎవరికీ ఎటువంటి వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు. కేన్స్‌లో ఐశ్వర్య అద్భుతంగా ఉన్నారు. ఆమెను మరేదైనా స్టైల్‌లో చూడాలనుకునే వారు మొదట మీ దగ్గర ఏముందో ప్రపంచానికి చూపించవచ్చు కదా?.. అయినా.. రెడ్‌కార్పెట్‌పై ఎప్పుడూ యువ నటీమణులే ఉండరు. ఇలా 50 ఏళ్లలో ఉన్నవారు కూడా మెరుస్తారు. వారిని చూడడం మీకు అలవాటు లేకపోతే ఇకనైనా అలవాటు చేసుకోండని తన పోస్ట్‌లో కంగనా రాసుకొచ్చారు. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో మే 12 నుంచి 23 వరకూ సందడిగా జరిగింది. ప్రముఖ డిజైనర్ అమిత్ అగర్వాల్ ప్రత్యేకంగా రూపొందించిన 'లుమినారా' అనే డీప్ సెర్-బ్లూ గౌన్‌లో ఐశ్వర్య రెడ్ కార్పెట్‌పై నడిచి అందరినీ మంత్రముగ్ధుల్ని చేశారు. రెండోరోజు వైట్ డ్రెస్‌తో ఫొటోలకు పోజులిచ్చారు.




## నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్ 'కరస్వామి' అనే లోకల్ దొంగ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. సినిమా థియేటర్లలో విడుదలైనప్పుడు మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. ధనుష్ నటన, యాక్షన్ సన్నివేశాలు మంచి ప్రశంసలు అందుకున్నాయి.




## రామాయణ్‌కు హన్స్ జిమ్మర్
# సంగీతం అదనపు ఆకర్షణ

### రామాయణ విదేశీయులను కూడా ఆకర్శించడం ఖాయం

హిందీలో తెరకెక్కుతున్న ఇతిహాసం 'రామాయణ్'పై సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ అద్భుత కావ్యం ఇండియాకే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకుంటుందని ఏఆర్ రెహమాన్ అన్నారు. దాదాపు 4000 కోట్ల బ్జడెట్‌తో నమిత్ మల్హోత్ర ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ గొప్ప ఇతిహాసం గురించి ప్రపంచానికి తెలియాలన్నదే నిర్మాతగా ఆయన ఆకాంక్ష. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్‌తోపాటు హాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ కూడా పని చేస్తున్నారు. ఆయనతో కలిసి పనిచేయడం గురించి తాజా ఇంటర్వ్యూలో రెహమాన్ మాట్లాడారు. 'సంగీత ప్రపంచంలో ఆయనది విభిన్నమైన శైలి. మాది గొప్ప స్నహం. మన దేశానికి, సంస్కృతికి సంబంధించిన గొప్ప చిత్రానికి మేమిద్దరం కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. జిమ్మర్‌ను ఈ కథలోకి తీసుకురావడం అంటే ఆయన్ను ప్రపంచ వేదికపై ఒక అంబాసిడర్‌లా నిలబెట్టడమే. ఆయన వల్ల విదేశీయులు కూడా ఈ చిత్రాన్ని వీక్షిస్తారు. ఒక భారతీయ సినిమాకు హన్స్ జిమ్మర్ ఎలాంటి సంగీతాన్ని అందించారో చూడాలనే ఎగ్జైట్‌మెంట్‌తో ఫారినర్స్ సైతం థియేటర్లకు వస్తారు. అలాంటి గొప్ప కళాకారుడితో కలిసి పనిచేయడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. అలాగే నా కెరీర్‌లోనే ఇదిఅతిపెద్ద చిత్రాల్లో ఒకటి. కథ పరంగానే కాదు అన్నివిధాలా ఇది ఆడియన్స్‌ను అలరిస్తుంది. ఈ సినిమా కోసం ఉపయోగిస్తున్న లేటెస్ట్ టెక్నాలజీ సినిమాను నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్తుంది. దీని ట్రైలర్ త్రీడీలో చూశాను. అద్భుతంగా ఉంది. ఇండియాలోనే కాకుండా గ్లోబల్ స్థాయిలో ఈ తరహా చిత్రాన్ని చూడలేదు. త్రీడీ విజువల్స్, మ్యూజిక్ ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. ఇది భారతదేశంలో రూపొందిన అద్భుతమైన చిత్రాలలో ఒకటిగా నిలుస్తుంది' అని రెహమాన్ అన్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. మొదటి పార్టు ఈ ఏడాది దీపవళికి విడుదల కానుంది. ఇందులో యశ్ రావణాసురుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా కనిపించనున్నారు.





# పర్సెంటేజీల కోసం ఎగ్జిబిటర్ల ఆందోళన


### రంగంలోకి దిగిన మెగాస్టార్ చిరంజీవి

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో గత కొన్ని రోజులుగా నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానుల మధ్య కొనసాగుతున్న వివాదం ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. కలెక్షన్లలో వాటా పద్ధతి అయిన 'పర్సంటేజ్ సిస్టమ్' అంశంపై రెండు వర్గాల మధ్య విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చడంతో, పరిశ్రమలో పెద్దదిక్కుగా భావించే మెగాస్టార్ చిరంజీవి ఈ సమస్య పరిష్కారానికి స్వయంగా ముందుకు వచ్చారు. తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు చిరంజీవిని ఆయన నివాసంలో కలవనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లలో కలెక్షన్ల ఆధారంగా పర్సంటేజ్ షేరింగ్ విధానం అమలులో ఉంది. అయితే సింగిల్ స్క్రీన్ థియేటర్ల విషయంలో మాత్రం పాత ఫిక్స్‌డ్ రెంటల్ పద్ధతినే కొనసాగిస్తున్నారని ఎగ్జిబిటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం, విద్యుత్ ఛార్జీల పెరుగుదల, నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిస్థితి క్లిష్టంగా మారిందని వారు చెబుతున్నారు. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా ఒకే స్థిర అద్దె చెల్లించాల్సి రావడం తమపై తీవ్ర ఆర్థిక భారం పెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న రెవెన్యూ షేరింగ్ విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా విడుదల సమయంలోనే ఈ వివాదం మరింత వేడెక్కింది. 'పెద్ది' సినిమా నుంచే పర్సంటేజ్ విధానం అమలు చేయాలని తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. పరిశ్రమలో పెద్ద సమస్యలు వచ్చినప్పుడు ముందుండి స్పందించే వ్యక్తిగా చిరంజీవికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈసారి ఒకవైపు తన కుమారుడు రామ్ చరణ్ సినిమా విడుదల, మరోవైపు థియేటర్ల యజమానుల సమస్యలు ఉండటంతో ఆయన ఈ వివాదంలో జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది

# లక్కీ ఛార్మ్ త్రిష

### ముగ్గరు హీరోలకు బ్లాక్ బస్టర్లు

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా కోలీవుడ్ స్టార్ హీరోల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె భాగం కావడం ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో 'త్రిష లక్కీ ఛార్మ్' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయింది. ప్రముఖ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ.. 'వారి బ్లాక్‌బస్టర్ విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది' అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రస్తుత తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో త్రిష నటించిన 'లియో' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం 2023లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విజయ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ రూపొందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్రలో నటించింది. ఈ సినిమా రూ.248 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అజిత్ కెరీర్‌లో బి÷-గగెస్ట్ హిట్‌గా నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య.. 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') సినిమాతో మళ్లీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు సినిమాల్లో కూడా త్రిష హీరోయిన్‌గా కనిపించడంతో.. అభిమానులు ఆమెను 'లక్కీ ఛార్మ్' అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు వశిష్ట మల్లిడి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె అవని పాత్రలో కనిపించనుంది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com